

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 326 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 28, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# కాయలు తప్పుతున్న కొత్తకొలువులు !




డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

**OLD FORMULA VS NEW**

Number of reserved posts, if BHU takes university as a unit (OLD)

| Name of posts (cadre) | General | SC | ST | OBC | Total |
|---|---|---|---|---|---|
| Professor | 197 | 38 | 18 | 00 | 253 |
| Associate Professor | 410 | 79 | 39 | 00 | 528 |
| Assistant Professor | 581 | 172 | 86 | 310 | 1,149 |
| Total | 1,188 | 289 | 143 | 310 | 1,930 |

Number of reserved posts, if BHU takes department as a unit (NEW)

| Name of posts (cadre) | General | SC | ST | OBC | Total |
|---|---|---|---|---|---|
| Professor | 250 | 03 | 00 | 00 | 253 |
| Associate Professor | 500 | 25 | 03 | 00 | 528 |
| Assistant Professor | 812 | 91 | 26 | 220 | 1,149 |
| Total | 1,562 | 119 | 29 | 220 | 1,930 |

**Data shared in govt SLP filed in SC this month

## పద్ధతి మారుతున్న కొత్త నియామక ప్రక్రియ

- విద్యా కార్యదర్శి యోగితరాణాను తప్పుదోవ పట్టిస్తున్న అనర్హత వీసీలు
- యూజిసి నియమాలకు విరుద్ధంగా యూనిట్ రిజర్వేషన్లు
- కాయలు తప్పిన కేకే
- జీవో నెంబర్ 15 లో యూనిట్ రిజర్వేషన్లు ఎక్కడివి
- కంటిన్యూషన్ నియామక రోస్టర్ పాయింట్ ను బొంద పెడతారా
- ఉత్తమ అధ్యాపక అవార్డుకు మార్కులేంది ?
- ప్రాజెక్టులు అనేవి కొత్త నియామక ఆశవాహకులకు ఎందుకు ఉంటాయి ?
- డిగ్రీ కాలేజ్ అధ్యాపకులకు ఉద్యోగాలు ఇవ్వడం కోసం కొత్త దుకాణం తెరిచినట్లుగా ఉంది !
- పాత నియామకాల్లో రోస్టర్లను అమ్ముకున్నారు ఇప్పుడు అదే తంతు !
- 14 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులు బతుకులను ఆగం చేయబోతున్నారు
- మొత్తం మీద దళారీ వ్యవస్థకు గిరాకి పెరుగుతున్నట్లుగా ఉంది !
- డాక్టర్ బరిగెల శివ



**యూనిట్ రిజర్వేషన్లపై వివాదం..** నిరుద్యోగుల హక్కులకు భంగం కలుగుతుందా? తెలంగాణలో 12 విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి చేపడుతున్న నియామక ప్రక్రియపై వివాదం నెలకొంది దాదాపు 14 ఏళ్లుగా నియామకాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్లో కొత్త విధానాలపై ఆందోళన వ్యక్తమవుతోందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. మొత్తం 429 పోస్టుల భర్తీకి సంబంధించి యూనిట్ రిజర్వేషన్ల అమలు, రోస్టర్ విధానంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూజీసీ నిబంధనలు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, విశ్వవిద్యాలయాల నియామక నిబంధనలకు అనుగుణంగానే ప్రక్రియ సాగాలని కోరారు. గత నియామకాల్లో రోస్టర్ అమలుపై వచ్చిన వివాదాలు పునరావృతం కాకుండా పారదర్శకత పాటించాలని సూచించారు. ఖాళీల వివరాలు, రిజర్వేషన్ రోస్టర్, ఎంపిక ప్రమాణాలు, మార్కుల కేటాయింపును బహిరంగంగా ప్రకటించాలని పేర్కొన్నారు. నియామకాల్లో అనుభవం, పరిశోధన ప్రాజెక్టులు, ఉత్తమ అధ్యాపక అవార్డులకు కేటాయిస్తున్న మార్కులపై కూడా స్పష్టత అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత విధానం వల్ల గత రోస్టర్ ప్రకారం అవకాశం కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు నష్టం జరుగుతుందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ అంశాలపై ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ, విశ్వవిద్యాలయాల అధికారులు అధికారిక వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. నియామకాలు న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా సాగి అర్హులైన అభ్యర్థులకు సముచిత అవకాశం దక్కేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ బరిగెల శివ డిమాండ్ చేశారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2

## దేవుని సేవకులను గౌరవించుకోవాలి

సీనియర్ దైవ జనులు జడ్సన్ అబ్రహం సేవలు కొనియాడదగినవి
జడ్సన్ అబ్రహం గారి ఆహ్వానం మేరకు డాక్టర్ బరిగెల శివ భేటీ
గొర్రెకుంటలో నాలుగు గంటలపాటు ఆత్మీయ సమావేశం
సేవా కార్యక్రమాలపై చర్చ

2



## ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు కృషి చేయాలి

సాగు లక్ష్యాలను రెట్టింపు చేయాలి: మంత్రి తుమ్మల
గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులతో మంత్రి భేటీ
అంజనాపురం యూనిట్‌కు అదనపు ప్రోత్సాహక ప్యాకేజీకి విజ్ఞప్తి
ఆరో తరం హైబ్రిడ్ సీడ్ గార్డెన్‌కు మరో 35 ఎకరాలు కేటాయించాలని కోరిన ప్రతినిధులు
రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడినిచ్చే మొక్కలు అందించాలి

**హైదరాబాద్, అక్టోబర్ 27 (జై భీమ్ న్యూస్) :**

తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు, రైతులకు నాణ్యమైన మొక్కలు అందించేలా కంపెనీలు పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం సచివాలయంలో గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులు మంత్రిని కలిసి ఆయిల్‌పామ్ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విజ్ఞప్తులు చేశారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సమీకృత ఆయిల్‌పామ్ యూనిట్‌కు, ఇప్పటికే అమలులో ఉన్న తెలంగాణ ఆహార శుద్ధి మరియు పరిరక్షణ విధానం (టీ–ఫాప్), తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మరియు పారిశ్రామికవేత్తల ప్రోత్సాహక విధానం (టీ–ఐడియా) కింద లభించే ప్రయోజనాలకు అదనంగా ప్రత్యేక ప్రోత్సాహక ప్యాకేజీ మంజూరుకు చొరవ తీసుకోవాలని ప్రతినిధులు మంత్రిని కోరారు. అదేవిధంగా యూనిట్‌కు అవసరమైన రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, ఆరో తరం హైబ్రిడ్ ఆయిల్‌పామ్ విత్తనాల ఉత్పత్తి కోసం భారతదేశంలోనే మొట్టమొదటి



## ఇంటర్ బోర్డు ముందు ఎస్ఎఫ్ఐ ధర్నా

కాంట్రాక్టు లెక్చరర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వెంటనే పూర్తి చేయాలి
ధ్రువపత్రాల పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలి

2

## గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్‌ను విజయవంతం చేయాలి

ఏర్పాట్ల పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
ఢిల్లీలో జరగనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి
సీఈవోలు, ప్రతినిధులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
డ్రోన్ ఆధారిత ప్రచారం చేపట్టాలని అధికారులకు ఆదేశం
కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయ నమూనాలకు ప్రాధాన్యం

2



# గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్‌ను విజయవంతం చేయాలి

**ఏర్పాట్ల పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష**
**ఢిల్లీలో జరగనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి**
**కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయ నమూనాలకు ప్రాధాన్యం**

**హైదరాబాద్, అక్టోబర్ 27 (జై భీమ్ న్యూస్) :**

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించారు. గ్లోబల్ సమ్మిట్, పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలతో సమావేశాలు, రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్ కార్యక్రమాల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణతో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠ ప్రపంచస్థాయిలో పెరిగే అవకాశం ఉందని పేర్కొన్న సీఎం, ఎల్లుండి ఢిల్లీలో జరగనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సీఈవోలు, ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, రాష్ట్ర విజయాలను అతిథులకు చాటిచెప్పేలా హైదరాబాద్‌లో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో పలు చోట్ల డ్రోన్ ఆధారిత ప్రచారం చేపట్టాలని, వాతావరణ మార్పులు, కృత్రిమ మేధ రంగాలకు సంబంధించిన ప్రముఖులను ఆహ్వానించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర సంప్రదాయాలు ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో డిజైన్లు రూపొందించాలని, కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయ నమూనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. బతుకమ్మ గురించి అతిథులు తెలుసుకునేలా ప్రత్యేక డిజైన్లు, ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

# ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు కృషి చేయాలి

మొదటి పేజీ తరువాయి

సీడ్ గార్డెన్‌ను ఏర్పాటు చేసేందుకు అదనంగా 35 ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. ఆధునిక ఆయిల్‌పామ్ మిల్లును ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో కంపెనీకి అదనపు జిల్లాలను కేటాయించాలని, ఆయిల్‌పామ్ గెలల ధరలను నిర్ణయించే సమయంలో కంపెనీల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించారు. అంజనాపురం ఆయిల్‌పామ్ యూనిట్‌కు సంబంధించిన రహదారి విస్తరణ, భూమి కేటాయింపు తదితర అంశాలపై ఖమ్మం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇప్పటికే ఆయిల్‌పామ్ సాగు చేపడుతున్న జిల్లాల్లో సాగు లక్ష్యాలను రెట్టింపు చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా పనిచేయాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణతో పాటు రైతులకు నాణ్యమైన మొక్కలను అందించడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. రైతులకు అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన, పొట్టి రకం మొక్కలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగు అభివృద్ధికి నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి కీలకమని పేర్కొన్న మంత్రి, దేశంలోనే మొట్టమొదటి సీడ్ గార్డెన్ ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం, కంపెనీలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా, గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ సునీల్ కటారియా, గ్రూప్ హెడ్ కార్పొరేట్ అఫైర్స్ రాకేష్ స్వామి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంటర్ బోర్డు ముందు ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

**హైదరాబాద్, అక్టోబర్ 27 (జై భీమ్ న్యూస్) :**

ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డు ముందు ధర్నా నిర్వహించారు. రెగ్యులర్ లెక్చరర్లుగా నియమితులైన కాంట్రాక్టు లెక్చరర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను వెంటనే పూర్తి చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజినీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. కిరణ్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మమత, కార్యదర్శివర్గ సభ్యుడు జి. కార్తీక్, రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్ గువేరా, రమేష్, నాయకులు భగత్, అర్జున్, నీరాజ్, వర్ధన్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# కమలంతో ధనుష్....

చెన్నై : హీరో ధనుష్ రాజకీయాల్లో అడుగు పెట్టేందుకు రోడ్ మ్యాప్ రెడీ చేసుకుంటున్నారు. అయితే ఈ క్రమంలో ఆయనపై అనేక రకాల ఊహాగానాలు రావడానికి ఆయనే చాన్స్ ఇస్తున్నారు. ఎక్కడా రాజకీయం గురించి బయట ప్రకటనలు చేయకపోయినా ఆయన చేసే పనుల్లో గుర్తులు వెదికేస్తున్నారు ఫ్యాన్స్. చెన్నై శివారు సెమ్మంచేరిలోని ఓ ప్రైవేట్ కళాశాల వేదికగా తన 'ధనుష్ నర్పణి ఇయక్కం' మహిళా విభాగం సభ్యులతో ధనుష్ భారీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు మూడు వేల మందికి పైగా మహిళా అభిమానులు తరలివచ్చిన ఈ వేదికపై ఆయన వారితో ఫొటోలు దిగి, దీపావళి కానుకగా వెండి కామాక్షి దీపాలను అందజేసి అభిమానాన్ని చాటుకున్నారు. అయితే అంతవరకు అంతా సజావుగానే సాగినా.. తీరా ఆ వెండి దీపాలను నిశితంగా పరిశీలించిన తర్వాత అసలు కథ మొదలైంది. ఆ వెండి దీపాల అడుగు భాగంలో స్పష్టంగా కమలం పువ్వు ముద్ర ఉండటమే ఇప్పుడు తమిళనాట పెను తుఫానును రేపింది. ధనుష్ ఇచ్చిన గిఫ్ట్‌పై కమలం గుర్తు కనిపించడంతో ధనుష్ వెనుక బీజేపీ ఉందా? ఆయనను బీజేపీ ఏదైనా ప్లాన్-సి గా తెరపైకి తెస్తోందా? అంటూ ఊహాగానాలు ప్రారంభమయ్యాయి. వివాదం ముదురుతుండటంతో అభిమాన సంఘం ప్రతినిధులు హడావుడిగా రంగంలోకి దిగి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. వెండి ప్రమిదలపై ఉన్న కమలం ముద్ర కేవలం ఆ ఆభరణాలను తయారు చేసిన జ్యువెలరీ సంస్థ ట్రేడ్‌మార్క్ స్టాంప్ మాత్రమేనని, దీనికి రాజకీయాలకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. కావాలనే కొందరు పనిగట్టుకుని రాజకీయ రంగు పులుముతున్నారని కొట్టిపారేశారు. అయితే రాజకీయ అడుగులు వేయాలని భావిస్తున్న ఒక అగ్ర నటుడు ఇంత సున్నితమైన అంశంలో అంతటి నిర్లక్ష్యంగా ఎలా ఉంటారన్న ప్రశ్నే ఇప్పుడు వినిపిస్తోంది. తమిళనాడు రాజకీయాలు అత్యంత సున్నితమైనవి. అక్కడ ఏ చిన్న సంకేతమైనా క్షణాల్లో తుఫానులా మారుతుంది. మూడు వేల మందికి ఇచ్చే వెండి దీపాలు ఆర్డర్ ఇచ్చి తెప్పించినప్పుడు.. ఆ వస్తువులపై ఏ ముద్రలు ఉన్నాయి? అవి ప్రజల్లోకి వెళ్తే ఎలాంటి సంకేతాలు వెళ్తాయి? అని హీరోగానీ, ఆయన తరఫు పీఆర్ బృందంగానీ ముందుగా చూసుకోకపోవడం వల్ల బీజేపీ ముద్ర పడిపోతోంది. ఆయన ఢిల్లీలో చర్చలు జరిపి వచ్చిన అంశం కూడా ఇక్కడ హాట్ టాపిక్ అవుతోంది.

# కాయలు "తప్పుతున్న" కొత్త కొలువులు

**పద్ధతి మారుతున్న కొత్త నియామక ప్రక్రియ**
**విద్యా కార్యదర్శి యోగితరాణాను తప్పుదోవ పట్టిస్తున్న అనర్హత వీసీలు**
**యూజిసి నియమాలకు విరుద్ధంగా యూనిట్ రిజర్వేషన్లు**
**కాయలు తప్పిన కేకే**
**జీవో నెంబర్ 15 లో యూనిట్ రిజర్వేషన్లు ఎక్కడివి**
**కంటిన్యూషన్ నియామక రోస్టర్ పాయింట్ ను బొంద పెడతారా...**
**ఉత్తమ అధ్యాపక అవార్డుకు మార్కులేంది ?**
**ప్రాజెక్టులు అనేవి కొత్త నియామక ఆశవాహకులకు ఎందుకు ఉంటాయి ?**
**డిగ్రీ కాలేజ్ అధ్యాపకులకు ఉద్యోగాలు ఇవ్వడం కోసం కొత్త దుకాణం తెరిచినట్లుగా ఉంది !**
**పాత నియామకాల్లో రోస్టర్లను అమ్ముకున్నారు ఇప్పుడు అదే తంతు!**
**14 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులు బతుకులను ఆగం చేయబోతున్నారు**
**మొత్తం మీద దళారీ వ్యవస్థకు గిరాకి పెరుగుతున్నట్లుగా ఉంది !**
**డాక్టర్ బరిగెల శివ**



**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

యూజిసి నియమాలకు విరుద్ధంగా నియామక ప్రక్రియ చేపట్టడం ముమ్మాటికి నేరమని డాక్టర్ బరిగెల శివ అభిప్రాయపడ్డారు. 14 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయాలలో నియామక ప్రక్రియలు లేక లైబ్రరీలతో కుస్తీ పడుతూ చదువుకున్న నిరుద్యోగులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల అధ్యాపకుల నియామకం కోసం 429 పోస్టులు మంజూరు చేస్తూ నియామక ప్రక్రియను చేపట్టడం శుభసూచికం అయినప్పటికీ పాత రోస్టర్ విధానాలను రన్నింగ్ రోస్టర్ విధానాలను బొంద పెడుతూ విశ్వవిద్యాలయాల చట్టాలలో ఎన్నడూ లేనివిధంగా యూనివర్సిటీలను యూనిట్ గా పరిగణిస్తూ రోస్టర్ విధానాన్ని అమలు చేయడం అనేది పాలకవర్గం అధికార వర్గం ప్రభుత్వ వ్యవస్థల ఒంటెద్దు పోకడలకు నిదర్శనంగా మారిపోయిందన్నారు. పాత నియమకాలలో కోర్టు కేసులతో అక్రమాలకు పాల్పడి అధ్యాపక ఉద్యోగాలను అమ్ముకున్నట్లుగా స్పష్టంగా తెలిపోవడంతో పాటు రోస్టర్ విధానాలను ట్యాంపరింగ్ చేసిన దాఖలాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ఆయా విశ్వవిద్యాలయాల్లోనైతే నియామక ప్రక్రియలు రద్దు చేయబడినప్పటికిని ప్రస్తుతం 12 విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న ఒకరిద్దరు అనర్హత కలిగిన వీసీలు వాళ్ల బంధు వర్గ ప్రీతి కోసం ఏకంగా తెలంగాణ విద్యా కార్యదర్శి యోగితరాణాను తప్పుదోవ పట్టిస్తూ క్యారీ ఫార్వర్డ్ కం రన్నింగ్ పోస్టర్ను పాటిస్తే భయంకరమైన అక్రమాలు వెలుగులోనికి వస్తాయని రాజకీయ పైరవీలతో యూనిట్ రోస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కుతూహలంగా పైరవీలు చేయడం అధ్యాపక పోస్టులను డిగ్రీ కాలేజ్ అధ్యాపకులకు అమ్ముకోవడం కోసం తాపత్రయపడుతున్నట్లుగా ఉందన్నారు. నోటిఫికేషన్ వెలువడితే విశ్వవిద్యాలయాలలో ఉద్యోగాలు పొందుకోగలమనే ధీమాతో చివరి నియామక ప్రక్రియలో ఆగిపోయిన రోస్టర్ ఆశావాకులు యూనిట్ రోస్టర్ విధానంతో ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉందని విశ్వాసం వర్గాల సమాచారం అన్నారు.

**కలతప్పుతున్న ఉద్యోగ నియామక ప్రక్రియ పద్ధతి..**

వాస్తవానికైతే ఏదైనా యూనివర్సిటీ విధాన నిర్ణయాలను సీనియర్ ప్రొఫెసర్లైన మేధావులతో సమాలోచనలు చేయిస్తూ వాళ్ళ సూచనలు తీసుకొని నిజాయితీని పాటిస్తారనేది యదార్థం అన్నారు. విద్యాశాఖ మంత్రైన ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్న రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో కాయలు తప్పిన కేకేను తనకు తానే మేధావిగా ప్రకటించి యూనివర్సిటీల భవిష్యత్తు మీద యూనివర్సిటీల మనగడం మీద పెత్తందారునిగా ఉంచడం విచారకరం అన్నారు. కొన్ని యూనివర్సిటీలలో అడ్డదారి సర్వీసులతో అడ్డదారుల్లో వచ్చిన కొంతమంది వైస్ చాన్సులర్లు వాళ్ళ కుటుంబ వర్గంను కాపాడుకోవడానికి ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యోగితరాణాను పక్కదారి పట్టిస్తున్నారనేది యూనిట్ పోస్టర్ విధానంతో యదార్ధంగా కనిపిస్తుంది అన్నారు. రోస్టర్లలో కొన్ని దశాబ్దాలలో ఒక్కసారి కూడా అవకాశం రాని రిజర్వేషన్లు చాలా ఉంటాయని గత 14 సంవత్సరాలుగా యూనివర్సిటీలలో అధ్యాపకులను నింపని పాలక పక్షాలు ఇదివరకు ఒంటెద్దు పోగడలతో గ్రూప్ 1 తరహాలో కొత్తదందాకు తెరలేపుతున్నారని నిరుద్యోగులు అనుమానాలను వ్యక్తపరుస్తున్నారని అన్నారు. పలు విశ్వవిద్యాలయాల్లో జరిగిన విధానాలను గమనించవలసి ఉంటుండగా ఒక యూనివర్సిటీలో ఫ్యాకల్టీ సోషల్ సైన్స్ లో 23వ రోస్టర్ దగ్గర గతంలో ఆగిపోతే ఆ తర్వాత గోస్ట్ ఫ్యాకల్టీ వాళ్లు 1000 కళ్ళతో ఉద్యోగం కోసం ఎదురు చూడడం జరిగిందని గుర్తు చేశారు. తీరా ఇప్పుడు అన్ని ఫ్యాకల్టీలు కలిపి యూనివర్సిటీలను యూనిట్ వారిగా విభజిస్తూ ఫస్ట్ రోస్టర్ నుండి నియామకం చేపట్టడం అనేది ఆశావాకుల జీవితాలతోటి చెలగాటాలు ఆడడమేనని స్పష్టం చేశారు. అసలు యూనివర్సిటీలను పాలించేది మేధావులైన వైస్ చాన్సులర్, రిజిస్ట్రార్లా.... అంతకుమించి డిగ్రీలతో వచ్చిన బ్యూరో కార్డ్స్ అనేది మేధావి వర్గం ఎటు తేల్చుకోలేక ముక్కున వేలేసుకుంటుందని అన్నారు. సరైన కాలిబర్ లేని వీసీ, రిజిస్ట్రార్లను నియమించి వాళ్లను తోలుబొమ్మలాటలు ఆడిస్తున్నారని తెలిపారు. దానికి తోడు ప్రతి యూనివర్సిటీలో అనర్హులైన వ్యక్తులను పాలకమండలిలలో సభ్యులుగా నియమించి తానా అంటే తందానా అనే విధంగా యూనివర్సిటీలలో విధానపరమైన నిర్ణయాలను అక్రమ పద్ధతిలో అమలు చేయిస్తున్నారని అన్నారు. పేరుకే ఉన్నత విద్యా శాఖ మంత్రి స్థానంలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి తెరచాటున మొత్తం ఉన్నత విద్యాశాఖ విధివిధానాల పనితీరును వేం నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగించడం దుర్మార్గంతో కూడిన హేయనీయమన్నారు. గతంలో పాలకమండలి చైర్మన్లు అయిన వీసీలు నేరుగా ముఖ్యమంత్రితో సమావేశాలు గాని సంభాషణలు గానీ జరుపుకుంటూ విశ్వవిద్యాలయాలలో కార్యకలాపాలు చేపట్టే వాళ్ళని ఇప్పటి వీసీలు, బ్యూరో కార్డ్స్ అయినా, ఉన్నత విద్యాశాఖ కమిషనర్, ప్రధాన కార్యదర్శులకు కిందిస్థాయి అధికారులు లాగా పని చేయబడే విధంగా ముఖ్యమంత్రి చైర్మన్ హోదాలోని వీసీలను బ్యూరో కార్డ్స్ అధికారులకు సభార్డినేట్స్ అయ్యేటట్లు విద్యాపాలన కొనసాగించడం బాధాకరమన్నారు. అసలు ఈ రిక్రూట్మెంట్ యూనివర్సిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు పార్ట్ టైం అధ్యాపకులకు డాక్టరేట్లకు కాకుండా డిగ్రీ కాలేజీల అధ్యాపకులకు సహాయం చేయడానికి అనేది స్పష్టంగా కనబడుతుంది అన్నారు. ముక్కేదంటే తల చుట్టూ తిప్పి చూపించినట్లుగా రిక్రూట్మెంట్లో కేటాయించిన 30 మార్కుల స్పష్టత నియామక ప్రక్రియలోని అసలు బాగోతాలను బయటపెడుతుందన్నారు. స్క్రూటినీకోసం డిగ్రీ కాలేజీ అధ్యాపకులను గత ఉన్నత విద్య ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలకు డిప్యూటేషన్ మీద తీసుకురావాలని ముమ్మర ప్రయత్నాలు చేసిన సందర్భంగా భారీ ఎత్తున చేతులు మారాయనే వదంతులు ఉన్నప్పటికీ ప్రస్తుతం అది అధికారికంగా వేం నరేందర్ రెడ్డి తోపాటు కాయలు తప్పిన కేకే ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేశారనేది కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది అన్నారు ఏ పాలన చరిత్ర చూసిన ఏముంది గర్వకారణం అన్నట్లుగా యూనివర్సిటీలో పాలనను అధోగతి పాలు చేయడం కోసమే యూనిట్ రిజర్వేషన్స్ తీసుకువచ్చి యూజీసీ నియమాలను తొక్కేస్తున్నారని వాటితో పాటు విశ్వవిద్యాలయాలలో అక్రమ పద్ధతిలో దొంగ పద్ధతిలో ఉద్యోగాలు పొందుకొని దర్జాగా పదవులు అనుభవిస్తున్న వ్యక్తులను కాపాడడం కోసం దొడ్డిదారి మార్గాలను రాజకీయ పైరవీలతో కొనసాగిస్తున్నారనేది స్పష్టంగా కనిపిస్తుంది అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంస్థ మేధావి వర్గంతో నిండుకొని ఉంటుండగా ఉన్నత విద్య మండల సంస్థ చైర్మన్ ఆచార్య బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆచార్య ఇటుకల పురుషోత్తం ఇరువురు అధికారులకు నియామిక ప్రక్రియకు సంబంధించిన రోస్టర్ విధానాలపై అత్యంత అవగాహన ఉంటున్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్ళని తట్టుకోలేక దొడ్డిదారి మార్గాలకే మొగ్గుచూపుతున్నట్లుగా సమావేశాల్లో తీసుకోబడుతున్న నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. అధికార వర్గమైన పాలకవర్గమైన నిరుద్యోగుల జీవితాలతో చెలగాటలాడాలనుకుని ప్రణాళికలు సిద్ధం చేయడం ముమ్మాటికి నేరమన్నారు జీవో నెంబర్ 21 లో జీవో నెంబర్ 31 లో ఎక్కడ కానరాని యూనిట్ రోస్టర్ ను, అనుకరిస్తూ నియామకాలను చేపట్టడంలో కంటిన్యుయేషన్ రోస్టర్ లో ఆశావాకులైన,నిరుద్యోగుల ఆత్మహత్యలను ప్రేరేపించినట్లుగా ఉందన్నారు.

**కాయలు తప్పిన కేకే.**

తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖలో నామినేటెడ్ హోదాలో కీలక పదవిలో కొనసాగుతున్న కేకే ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరగబోతున్న 12 యూనివర్సిటీల అధ్యాపకుల నియామకాల ప్రక్రియపై అధికార పాలకవర్గాలతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి నియామక ప్రక్రియకు సంబంధించి రహస్య నివేదికను సిద్ధపరచినట్లు మేధావులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు విశ్వవిద్యాలయాలలో ఎక్కడా లేని దరిద్రపు రోస్టర్ విధానాన్ని బలవంతంగా ప్రయోగించడంలో కీలక పాత్ర పోషిస్తున్న కేకే వృద్ధాప్యంలో కాయలు తప్పిన విధానాలను ప్రభుత్వాలపై ప్రభుత్వ కార్యాలయాలపై విశ్వవిద్యాలయాలపై రుద్దుతూ తన మేధావితనాన్ని బలపరచుకుంటున్నారని అన్నారు. రోస్టర్ విధానంలో విశ్వవిద్యాలయాల ఖాళీల విషయాలలో వీసీ రిజిస్ట్రార్లకే క్లారిటీ లేకపోతే ఎట్లా అంటూ సూటిగా నిలదీశారు. మొత్తం మీదుగా విశ్వవిద్యాలయాలలో అధ్యాపక నియామకాల ప్రక్రియ కాయ్ బాజాకాయ్ అన్నట్లుగా సాగుతుండడం గమనిస్తుంటే ఉద్యోగాలను అమ్ముకునే విధానం బలపరుస్తున్నట్లుగా కనిపిస్తుందన్నారు. నియామక ప్రక్రియకు సంబంధించి ప్రతి విధివిధానాలను యూజీసీ రోస్టర్ విధానాలను విశ్వవిద్యాలయ వీసీలు అన్ని విశ్వవిద్యాలయ వెబ్సైట్లో పొందుపరుస్తూ బహిరంగ ప్రకటనలు చేసి నిజాయితీని నిరూపించుకునేది పోయి రహస్యమైన పద్ధతిలో ఆయా విశ్వవిద్యాలయాలకు కేటాయించిన పోస్టులను పాలకమండలి సమావేశాల్లో అక్రమంగా ఆమోదించుకుంటూ యూనివర్సిటీలకు చెందిన యూనిఫామ్ గైడ్లైన్స్ కు తూట్లు పొడుస్తున్నారనేది మాత్రం పక్కా నిజమన్నారు.

# దేవుని సేవకులను గౌరవించుకోవాలి

**సీనియర్ దైవ జనులు జడ్సన్ అబ్రహం సేవలు కొనియాడదగినవి.**
**జడ్సన్ అబ్రహం గారి ఆహ్వానం మేరకు డాక్టర్ బరిగెల శివ భేటీ.**
**గొర్రెకుంటలో నాలుగు గంటలపాటు ఆత్మీయ సమావేశం..**
**సేవా కార్యక్రమాలపై చర్చ**

**గొర్రెకుంట జై భీమ్ న్యూస్ :-**

జడ్సన్ అబ్రహం గారి ఆహ్వానం మేరకు జై భీమ్ టీవీ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ బరిగెల శివ గొర్రెకుంటలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుమారు నాలుగు గంటలపాటు పలు సామాజిక అంశాలు, సేవా కార్యక్రమాలు, ప్రజల సంక్షేమానికి సంబంధించిన విషయాలపై ఆత్మీయంగా చర్చించుకున్నారు. గతంలో ఎంతోమంది పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అన్నదానం చేస్తూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచిన సేవా నేపథ్యం జడ్సన్ అబ్రహం గారి కుటుంబానిది. నేటికీ అదే సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ, అవసరంలో ఉన్నవారికి వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజా ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత ఎస్.ఎస్. రాజు కూడా పాల్గొన్నారు. ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో కొనసాగగా, సేవా కార్యక్రమాల ప్రాధాన్యత, సామాజిక బాధ్యత వంటి అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. మతాలకు అతీతంగా మానవత్వానికి ప్రాధాన్యతనిస్తూ, పేదలకు అండగా నిలవడం, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం సమాజానికి ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా చర్చించుకున్నారు.



- డాక్టర్ బరిగెల శివ, జై భీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్.

# మలబార్ గోల్డ్‌పై కేసు నమోదైనట్లు ప్రచారం!

**ఒకే బ్రాస్‌లెట్.. రెండు రకాల పరీక్షా ఫలితాలు!**
**బంగారం స్వచ్ఛత పరీక్షపై అనుమానాలు..**
**వినియోగదారుల్లో చర్చ**





**బిలాస్‌పూర్, 27 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

బంగారు ఆభరణాల స్వచ్ఛత పరీక్షలో ఒకే బ్రాస్‌లెట్‌కు రెండు రకాల ఫలితాలు వచ్చాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో ఉన్న మలబార్ గోల్డ్ దుకాణంలో ఈ ఘటన జరిగినట్లు ప్రచారంలో ఉంది. అయితే ఘటనకు సంబంధించిన వివరాలను అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది.కథనం ప్రకారం.. 22 క్యారెట్ల హాల్‌మార్క్ ఉన్న పాత బ్రాస్‌లెట్‌ను మార్చుకునేందుకు ఓ వినియోగదారుడు దుకాణానికి వెళ్లాడు. అక్కడి సిబ్బంది పరీక్షా యంత్రంతో తనిఖీ చేయగా 20 క్యారెట్లుగా ఫలితం వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, ఆభరణంపై హాల్‌మార్క్ లేదని చెప్పినట్లు సమాచారం.దీంతో ఆ బ్రాస్‌లెట్‌ను గతంలో విక్రయించిన స్థానిక బంగారు ఆభరణాల వ్యాపారిని వినియోగదారుడు అక్కడికి పిలిపించినట్లు కథనం పేర్కొంది. ఆయన హాల్‌మార్క్ గుర్తింపు సంఖ్యను పరిశీలించి, తన సమక్షంలో మరోసారి పరీక్షించాలని కోరినట్లు తెలిపింది.అదే యంత్రంతో మరోసారి పరీక్షించే సమయంలో దాని అమరికను మార్చిన తర్వాత 916గా ఫలితం వచ్చిందని, ఈ పరిణామాన్ని వీడియోలో చిత్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది.

**ఒకే ఆభరణానికి రెండు ఫలితాలు ఎలా?**

ఒకే బ్రాస్‌లెట్‌కు మొదట 20 క్యారెట్లు, ఆ తర్వాత 22 క్యారెట్లకు సమానమైన ఫలితం రావడానికి కారణమేంటి? యంత్రం అమరికలో సమస్య ఉందా? పరీక్షా విధానంలో లోపమా? ఉద్దేశపూర్వకంగా ఫలితాన్ని మార్చారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఈ ప్రశ్నలకు సమాధానం లభించాలంటే యంత్రాన్ని సాంకేతిక నిపుణులతో పరీక్షించడంతో పాటు, సంబంధిత వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించాల్సి ఉంది.కథనంలో పేర్కొన్న వివరాల ప్రకారం, దుకాణ నిర్వాహకుడు, పరీక్షా యంత్రాన్ని నిర్వహించిన ఉద్యోగిపై పోలీసులు కేసు నమోదు చేసి, యంత్రం, నిఘా కెమెరాల రికార్డింగ్ పరికరాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే కేసు నమోదు, స్వాధీనానికి సంబంధించిన వివరాలను పోలీసుల అధికారిక ప్రకటన ద్వారా నిర్ధారించాల్సి ఉంది.

**వినియోగదారులూ అప్రమత్తంగా ఉండాలి**

బంగారు ఆభరణాలను మార్చుకునే సమయంలో హాల్‌మార్క్, గుర్తింపు సంఖ్య, బరువు, స్వచ్ఛత వివరాలను పరిశీలించాలి. పరీక్షా ఫలితంపై అనుమానం కలిగితే మరో గుర్తింపు పొందిన కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలి. యంత్రం ఇచ్చిన ఫలితమే అంతిమమని భావించకుండా, పరీక్షా విధానం సక్రమంగా జరిగిందో లేదో నిర్ధారించుకోవాలి.బంగారు ఆభరణాల వ్యాపారంలో వినియోగదారుల నమ్మకమే కీలకం. ఆరోపణల్లో వాస్తవాలు ఉన్నట్లయితే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో విచారణ పూర్తికాకముందే ఏ సంస్థనైనా దోషిగా నిర్ధారించడం సరికాదు.బంగారం స్వచ్ఛతపై సందేహాలకు తావులేకుండా పారదర్శక పరీక్షలు నిర్వహించడం, వినియోగదారులకు స్పష్టమైన వివరాలు అందించడం ప్రతి వ్యాపార సంస్థ బాధ్యత.

---

## పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ సైకిల్ ర్యాలీ





**హన్మకొండ, అక్టోబర్ 27(జై భీమ్ న్యూస్)**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ట్రైసిటీలోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. వారి సేవలను ఎప్పటికీ మరువకూడదని, అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన సైకిల్ ర్యాలీ వారికి అంకితం చేసిన ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. సైక్లింగ్ వంటి శారీరక వ్యాయామాలు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 60 సంవత్సరాలకు పైబడిన వృద్ధులు సైతం ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా 89 ఏళ్ల వయస్సులో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మామిడి నర్సయ్యను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఆయన ఉత్సాహం అందరికీ స్ఫూర్తిదాయకమని, వయస్సు వ్యాయామానికి అడ్డంకి కాదని ఈ ర్యాలీ నిరూపించిందని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సైకిల్ ర్యాలీని విజయవంతంగా నిర్వహించిన ఏఆర్ అదనపు డీసీపీలు వి. శ్రీనివాస్, సురేష్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్‌లను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, హనుమకొండ ఏసీపీ నర్సింహరావు, సీఐలు, ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది, నగరంలోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు కలిపి సుమారు 200 మంది పాల్గొన్నారు.

---

## తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి

**రాష్ట్ర కార్యదర్శి పాకాల వెంకన్న**



**హన్మకొండ, అక్టోబర్ 27(జై భీమ్ న్యూస్)**

ఈ నెల 31న కొత్తగూడెంలో నిర్వహించనున్న తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) 17వ ఆవిర్భావ సభను విద్యార్థులు, మేధావులు, కార్మికులు, రైతులు, మహిళలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పాకాల వెంకన్న పిలుపునిచ్చారు. హన్మకొండ అంబేద్కర్ సెంటర్‌లో మంగళవారం పాకాల వెంకన్న ఆధ్వర్యంలో "హలో విద్యార్థి.. చలో కొత్తగూడెం" అనే నినాదంతో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వంపై మరోసారి ప్రారంభమైన కోస్తాంధ్ర--పెట్టుబడిదారుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా "ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడదాం" అనే నినాదంతో కొత్తగూడెంలో టీపీఎఫ్ 17వ ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రజల హక్కులు, అస్తిత్వం, ప్రజాస్వామిక విలువల పరిరక్షణ కోసం జరిగే ఈ సభకు విద్యార్థులు, యువత, వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. సభను విజయవంతం చేసేందుకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీఎఫ్ రాష్ట్ర నాయకులు కడమంచి వెంకన్న, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు, డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రవణ్, జిల్లా కన్వీనర్ శివ, టీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భరత్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో మారిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ తేదీ

విజయవాడ : ప్రభుత్వం 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ లబ్ధిదారులకు కీలక సమాచారం అందించింది. ప్రతి నెలా 1వ తేదీన అందించే పెన్షన్లను, ఈసారి రెండు రోజుల ముందుగానే పంపిణీ చేయాలని నిర్ణయించింది. దీని ప్రకారం, నవంబర్ 1వ తేదీకి బదులుగా అక్టోబర్ 30 నుంచే లబ్ధిదారులకు నగదు అందజేయనున్నారు. రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 1న రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్, నవంబర్ 3న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. సిబ్బంది అంతా ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉండటం, పోలింగ్ రోజున లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పెన్షన్ల పంపిణీని ముందుగానే పూర్తి చేయాలని భావించింది. ఈ మేరకు అక్టోబర్ 29వ తేదీ నాటికే పెన్షన్లకు అవసరమైన నగదును సిద్ధంగా ఉంచుకోవాలని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి, బ్యాంకు మేనేజర్లకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

---

## ప్రతి ఓటరు ప్రజాస్వామ్య కాపలాదారుడే

**కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య బి. సురేష్ లాల్**




**హన్మకొండ, అక్టోబర్ 27(జై భీమ్ న్యూస్)**

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ప్రతి ఓటరు ప్రజాస్వామ్యాన్ని రక్షించే కాపలాదారుడని కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య బి. సురేష్ లాల్ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిజాయితీగా వినియోగించినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఆవరణలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు చైతన్య సదస్సుకు ఆచార్య సురేష్ లాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓటు మార్పుకు ఒక శక్తివంతమైన ఆయుధమని, దానిని వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజం, ప్రాంత అభివృద్ధి కోసం వినియోగించాలని సూచించారు. ఓటుతో ప్రభుత్వాలను నిలబెట్టే అవకాశం ఉందని, అవసరమైతే అధికారాన్ని మార్చే శక్తి కూడా ఓటరుకు ఉందని అన్నారు. మనకు కావాల్సిన అభివృద్ధిని సాధించుకోవాలంటే ఆత్మసాక్షిగా ఓటు వేసి మంచి భవిష్యత్తుకు పునాదులు వేయాలని సూచించారు. ఓటును ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్ముకోవద్దని, ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగల అభ్యర్థులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కాకతీయ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతి, ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ తమ వివరాలను సంబంధిత బీఎల్ఓలకు అందజేసి ఓటు హక్కును కొనసాగించుకోవాలని సూచించారు. త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో డిప్లొమా, డిగ్రీ విద్యార్హత కలిగిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఆడే ప్రాజెక్టు, గీసుకొండ సబ్‌ఇన్‌స్పెక్టర్ రవీందర్, డాక్టర్ వంగాల సుధాకర్, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

---

## అర్నాబ్ తుఫాను నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్**

**కాకినాడ, అక్టోబర్ 27(జై భీమ్ న్యూస్)**




అర్నాబ్ తుఫాను నేపథ్యంలో కాకినాడ జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ సూచించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందాలని ఎస్పీ సూచించారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగుల భద్రతపై కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో పిల్లలు ఆటల కోసం బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌లు, పాత భవనాల సమీపంలో ఉండకూడదని హెచ్చరించారు. తెగిపడిన విద్యుత్ తీగలను తాకకుండా వాటికి దూరంగా ఉండాలని సూచించారు. వరద నీరు ప్రవహిస్తున్న రోడ్లు, వాగులు, కల్వర్టులను దాటేందుకు ప్రయత్నించకూడదని, అత్యవసరమైతే తప్ప ద్విచక్ర వాహనాలు, కార్లపై ప్రయాణాలు చేయవద్దని తెలిపారు. చెరువులు, కాలువలు, నదులు, సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లకూడదని, సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని ఎస్పీ సూచించారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారులు సంబంధిత అధికారుల సూచనలను పాటించాలని కోరారు. బలహీనమైన గోడలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, రేకుల షెడ్లలో నివసించే వారు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. తాగునీరు, ఆహార పదార్థాలు, మందులు, టార్చ్‌లైట్లు, మొబైల్ ఛార్జర్లు, బ్యాటరీలు వంటి అత్యవసర వస్తువులను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. వర్షం, గాలుల తీవ్రత అధికంగా ఉన్న సమయంలో తలుపులు, కిటికీలు మూసి సురక్షితమైన గదిలో ఉండాలని సూచించారు. పశువులు, పెంపుడు జంతువులను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించి అవసరమైన ఆహారం, నీరు అందుబాటులో ఉంచాలని కోరారు. తుఫానుకు సంబంధించి వచ్చే వదంతులను నమ్మవద్దని, ఇతరులకు పంపవద్దని ఎస్పీ సూచించారు. వాతావరణం, తుఫాను హెచ్చరికలకు సంబంధించి అధికారికంగా వెలువడే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని తెలిపారు. అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా రోడ్లపై అనవసరంగా గుమిగూడవద్దని, ప్రమాదకర ప్రాంతాల్లో ఫొటోలు, వీడియోలు తీసేందుకు వెళ్లవద్దని హెచ్చరించారు. పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, విద్యుత్ తదితర అత్యవసర సేవల సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు. ఏదైనా ప్రమాదం లేదా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే పోలీసు అత్యవసర సహాయ నంబర్ 112కు లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్లు 94949 33233, 94906 19298కు సమాచారం అందించాలని సూచించారు. తుఫాను సమయంలో ప్రజల ప్రాణ భద్రతే ప్రధానమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అధికారుల సూచనలు పాటించాలని ఎస్పీ జి. బిందు మాధవ్ కోరారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem
సామాన్యుడి ఆయుధంగా

# సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలి

**సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి**




**హన్మకొండ, అక్టోబర్ 27(జై భీమ్ న్యూస్)**

వయోవృద్ధుల కోసం సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో అందిస్తున్న ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి సూచించారు. హనుమకొండ జిల్లా పరిషత్ ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌ను మంగళవారం డాక్టర్ అనితా రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత ఫిజియోథెరపీ క్లినిక్, లీగల్ ఎయిడ్ క్లినిక్, లైబ్రరీ నిర్వహణ తీరును పరిశీలించారు. ఆయా కేంద్రాలకు వస్తున్న వృద్ధుల సంఖ్య, అందుతున్న సేవలు, న్యాయ సలహాలు, కౌన్సెలింగ్ పొందుతున్న వారి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ డే కేర్ సెంటర్‌లో అందిస్తున్న ఉచిత ఫిజియోథెరపీ, ఉచిత న్యాయ సలహా సేవలను వృద్ధులు వినియోగించుకోవాలని కోరారు. సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు వయోవృద్ధులకు ఒక వరం వంటిదని పేర్కొన్నారు. జిల్లాలో ట్రిబ్యునల్ కోర్టుకు వస్తున్న కేసులు, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలు, కోర్టు పనిచేస్తున్న తీరును వివరించారు. వయోవృద్ధులకు మరిన్ని సేవలు అందించే అంశంపై డే కేర్ సెంటర్ సిబ్బందితో చర్చించారు. సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు ద్వారా వృద్ధులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని అన్నారు. సీనియర్ సిటిజన్స్ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, అన్ని శాఖల సమన్వయంతో వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, డాక్టర్ ఉష, ఉమ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో రక్తదాన శిబిరం

**101 యూనిట్ల రక్తం సేకరణ - స్వయంగా రక్తదానం చేసిన సీపీ ఎన్. శ్వేత**






**వరంగల్, అక్టోబర్ 27(జై భీమ్ న్యూస్)**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో భీమారంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 101 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ స్వయంగా రక్తదానం చేసి పోలీసు సిబ్బందికి, ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో విలువైన ప్రాణాలను కాపాడవచ్చని సీపీ ఎన్. శ్వేత తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అదనపు డీసీపీలు సురేష్, వి. శ్రీనివాస్, ఏసీపీలు మధుసూదన్, నరసింహారావు, సత్యనారాయణ, ఏఆర్ ఏసీపీలు నాగయ్య, అనంతయ్య, సురేంద్ర, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలక మండలి సభ్యులు కె. రాకేష్ రావు, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్నబ్ తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మంగళ, బుధవారాల్లో విద్యాసంస్థలకు సెలవులు..**
**ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలి**
**తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, అక్టోబర్ 27(జై భీమ్ న్యూస్)**

అర్నబ్ తుఫాను ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గంటకు 130 నుంచి 140 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. వాతావరణ అంచనాల ప్రకారం అక్టోబర్ 27, 28 తేదీల్లో తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, కాకినాడ జిల్లా--యానాం పరిసర ప్రాంతాల సమీపంలో తుఫాను తీరం దాటే అవకాశం ఉన్నట్లు అంచనాలు ఉన్నాయని కలెక్టర్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తుఫాను ప్రభావం దృష్ట్యా అక్టోబర్ 27, 28 తేదీల్లో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. బలమైన గాలుల కారణంగా చెట్లు, హోర్డింగులు, బ్యానర్లు కూలిపోయే ప్రమాదం ఉన్నందున అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటకు రావద్దని, ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులు, బ్యానర్లను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని వెల్లడించారు. జిల్లాలోని ప్రతి మండలంలో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించి అవసరమైన సహాయం పొందాలని సూచించారు. పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పూరి గుడిసెలు, మట్టి గోడల ఇళ్లలో నివసించే ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. భారీ వర్షాలు, బలమైన గాలుల నేపథ్యంలో ఆయా కుటుంబాలు మంగళవారం సాయంత్రంలోగా సమీపంలోని సహాయక కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ



తమతోపాటు కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు.

# ఆసుపత్రి పరిశుభ్రత ప్రతి ఒక్కరి సమిష్టి బాధ్యత

**కాయకల్ప కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు**



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 27(జై భీమ్ న్యూస్)**



రోగులకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆసుపత్రి పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు అన్నారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలలో కాయకల్ప అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది, వైద్య విద్యార్థులకు ఆసుపత్రి పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, చేతుల పరిశుభ్రత, ఇన్ఫెక్షన్ల నియంత్రణపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ ఆసుపత్రి పరిశుభ్రత కేవలం పారిశుధ్య సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది, వైద్య విద్యార్థులు సహా ప్రతి ఒక్కరి సమిష్టి బాధ్యత అని స్పష్టం చేశారు. పరిశుభ్రమైన ఆసుపత్రి వాతావరణం ఇన్ఫెక్షన్ల వ్యాప్తిని తగ్గించడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. హరప్పా, మొహెంజోదారో నాగరికతల్లో కనిపించిన ప్రణాళికాబద్ధమైన పట్టణ నిర్మాణం, మురుగునీటి పారుదల వ్యవస్థలు సైతం పరిశుభ్రత ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. కాయకల్ప కార్యక్రమ లక్ష్యాలను ప్రతి ఒక్కరూ తమ విధి నిర్వహణలో భాగంగా ఆచరించాలని పిలుపునిచ్చారు. మైక్రోబయాలజీ విభాగాధిపతి డా. ఎం. భారతి మాట్లాడుతూ బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం వేర్వేరుగా సేకరించి సురక్షితంగా పారవేయడం ద్వారా ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గించవచ్చని వివరించారు. అపరిశుభ్రమైన చేతుల ద్వారా సూక్ష్మజీవులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున సరైన సమయంలో, సరైన పద్ధతిలో చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. పాథాలజీ విభాగాధిపతి డా. బి. కిరణ్మయి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఆరోగ్య పరిరక్షణకు పునాది అని అన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. వి.వి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రోగిని తాకడానికి ముందు, తాకిన తర్వాత, రోగి సంరక్షణలో కీలక సందర్భాల్లో చేతుల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో హ్యాండ్ శానిటైజర్‌ను వినియోగించాలని తెలిపారు. డా. బి. శ్రీనివాస్ నాయక్ కాయకల్ప కార్యక్రమ లక్ష్యాలు, అమలు విధానాలను వివరించారు. పారిశుధ్య నిర్వహణ, వ్యర్థాల సక్రమ పారవేత, ఇన్ఫెక్షన్ నియంత్రణ, నాణ్యమైన వైద్య సేవలు కాయకల్ప కార్యక్రమంలో ప్రధాన అంశాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో శుభ్రత కార్యక్రమం నిర్వహించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంపై సిబ్బంది, విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, వైద్య విద్యార్థులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హాస్టళ్ల మూసివేత ఆపాలి

**నాకాఫ్ కాంట్రాక్టు రద్దు చేయాలి: పీడీఎస్‌యూ**




**హన్మకొండ, అక్టోబర్ 27(జై భీమ్ న్యూస్)**

ఎఫ్ఆర్ఎస్ పేరుతో హాస్టళ్ల మూసివేతకు సంబంధించిన చర్యలను తక్షణమే నిలిపివేయాలని, వసతి గృహాలకు సరుకుల సరఫరాలో విఫలమైన నాకాఫ్ (ఎన్సీసీఎఫ్) కాంట్రాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పేయ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ.. వసతి గృహాలకు సరుకులు సక్రమంగా సరఫరా చేయడంలో విఫలమైన నాకాఫ్ కాంట్రాక్టును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్ఎస్ పేరుతో హాస్టళ్లను మూసివేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. రాష్ట్రంలోని 1,024 గురుకులాలు, 243 ఆశ్రమ పాఠశాలలు, 400కు పైగా కేజీబీవీలకు సరుకుల సరఫరాలో సమస్యలు ఏర్పడ్డాయని, దీంతో వార్డెన్లు అప్పులపాలవుతున్నారని, మెనూలో కోతలు విధించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను మూసివేసే చర్యలను విరమించుకోవాలని, పారదర్శకంగా టెండర్ ప్రక్రియ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కొత్త కాంట్రాక్టు ఖరారయ్యే వరకు పాత కాంట్రాక్టర్ల ద్వారా తాత్కాలికంగా సరుకుల సరఫరా కొనసాగించాలని, సరఫరా వ్యవస్థపై జిల్లా స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు ప్రవీణ్, సంతోష్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీఎం ఆసుపత్రిలో 16 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

**నవంబర్ 2న వాక్-ఇన్ ఇంటర్వ్యూలు.. అర్హులైన అభ్యర్థులకు అవకాశం**

**వరంగల్, 27 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



పత్రికా ప్రకటన
ఎంజీఎం ఆసుపత్రి, వరంగల్
కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకానికి నోటిఫికేషన్

ఎంజీఎం ఆసుపత్రి, వరంగల్ లో పనిచేయుటకు, క్రింది పట్టికలో పేర్కొన్న విభాగాలలో 16 (పదహారు) అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయుటకు, పట్టికలో పేర్కొన్న అర్హతలు కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన కాంట్రాక్ట్ పద్ధతిలో, నియామక తేదీ నుండి 31/03/2027 వరకు లేదా వాస్తవ అవసరం ముగిసే వరకు — వీటిలో ఏది ముందుగా జరిగితే అప్పటి వరకు మాత్రమే కొనసాగుతాయి.

| క్రమ సంఖ్య | విభాగం (Department) | పోస్టుల సంఖ్య | అర్హత (Qualification) |
|---|---|---|---|
| 1 | Orthopedics | 04 | MS Ortho or Equivalent |
| 2 | Paediatrics | 01 | MD Paediatrics or Equivalent |
| 3 | Emergency Medicine (MD.EM / NMC నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ఏదైనా డిగ్రీ) | 07 | MD.EM (or) MS Gen. Surgery |
| | | | MD.EM (or) MS Gen. Medicine |
| | | | MD.EM (or) MS Ortho |
| | | | MD.EM (or) MD Anaesthesia |
| 4 | Radiology | 02 | MD Radiology or Equivalent |
| 5 | Cardiology | 01 | DM Cardiology or Equivalent |
| 6 | Neuro Surgery | 01 | M.Ch Neurosurgery or Equivalent |
| | మొత్తం | 16 | |

నోటిఫికేషన్ 27/10/2026 న జారీ చేయబడి, ప్రచురించబడింది. అర్హులైన అభ్యర్థులు 02/11/2026 న ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరై, తమ డాక్యుమెంట్లను సమర్పించాలి. దరఖాస్తు ఫారమ్ ఎంజీఎం ఆసుపత్రి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. తుది జాబితా ఆసుపత్రి అధికారిక వెబ్‌సైట్‌లో మరియు ఆసుపత్రి నోటీసు బోర్డులో ప్రచురించబడుతుంది.

**వేదిక:** మొదటి అంతస్తు, కాన్ఫరెన్స్ హాల్, సూపరింటెండెంట్ ఛాంబర్ ఎదురుగా, ఎంజీఎం ఆసుపత్రి.

District Website: https://warangal.telangana.gov.in
Hospital website: https://mgmwarangal.com

మెడికల్ సూపరింటెండెంట్
ఎంజీఎం ఆసుపత్రి, వరంగల్

వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన 16 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆసుపత్రి వైద్య సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతలు కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన కాంట్రాక్ట్ పద్ధతిలో చేపట్టనున్నట్లు వెల్లడించారు. నియామక తేదీ నుంచి 2027 మార్చి 31 వరకు లేదా వాస్తవ అవసరం ముగిసే వరకు, ఈ రెండింటిలో ఏది ముందుగా జరిగితే అప్పటి వరకు మాత్రమే నియామకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

**నవంబర్ 2న వాక్-ఇన్ ఇంటర్వ్యూలు**

అర్హులైన అభ్యర్థులు 2026 నవంబర్ 2వ తేదీన ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, అనుభవం, ఇతర సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు నమూనా ఎంజీఎం ఆసుపత్రి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను ఆసుపత్రి అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఆసుపత్రి నోటీసు బోర్డులో ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.

**ఇంటర్వ్యూ వేదిక**

స్థలం: మొదటి అంతస్తు, సమావేశ మందిరం, సూపరింటెండెంట్ ఛాంబర్ ఎదురుగా, ఎంజీఎం ఆసుపత్రి, వరంగల్. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని, ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయంలో అవసరమైన ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని ఆసుపత్రి అధికారులు సూచించారు.

# ఈదురుగాలులకు విరిగిపడిన చెట్టు.. ఇంటిపై కూలిన వైనం..!

**హుద్‌హుద్ తుఫాన్‌లోనూ ఇదే చెట్టుతో నష్టం.. యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటున్న బాధితులు..!**

విశాఖపట్నం: మహారాణిపేట పరిధిలోని అంగడిదిబ్బ వద్ద ఈదురుగాలులకు చెట్టు విరిగి పక్కనే ఉన్న నమ్మి నరసింగరావు ఇంటిపై పడింది. ప్రకాశ్ ఆర్ట్స్ కార్యాలయం ఆవరణలోని ఈ చెట్టు కూలడంతో ఇంటి పెంకులు దెబ్బతిన్నాయి. ఇంటి ఆవరణలో ఉన్న పాన్‌షాపు రేకులపై కూడా చెట్టు కాండం పడటంతో షాపు రేకులు, లోపల ఉన్న సామగ్రి ధ్వంసమయ్యాయి. విద్యుత్ వైర్లు సైతం తెగిపడ్డాయి. గతంలో హుద్‌హుద్ తుఫాన్ సమయంలోనూ ఇదే చెట్టు ఇంటిపై పడి రేకులు దెబ్బతిన్నాయని బాధితులు తెలిపారు. చెట్టు కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఈ ఘటనకు కారణమని బాధితులు ఆరోపిస్తున్నారు. చెట్టు ప్రమాదకరంగా ఉందని చుట్టుపక్కల వారు పలుమార్లు చెప్పినా ప్రకాశ్ ఆర్ట్స్ యాజమాన్యం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో నష్టపోయిన తమకు ప్రకాశ్ ఆర్ట్స్ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# బైరాన్‌పల్లిలో మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు





**హసన్ పర్తి, అక్టోబర్ 27 (జై భీమ్ న్యూస్)**

వికాస తరంగిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో, బైరాన్‌పల్లి గ్రామపంచాయతీ సహకారంతో, సెర్ప్--డీఆర్‌డీఏ సహకారంతో మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మహిళల్లో క్యాన్సర్‌పై అవగాహన పెంచడంతో పాటు, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ రకాల క్యాన్సర్ నిర్ధారణకు సంబంధించిన ప్రాథమిక స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనుమానాస్పద లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముందస్తు పరీక్షల ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. డీఆర్‌డీఏ అధికారి మేన శ్రీను మాట్లాడుతూ, మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా చికిత్స సులభతరం అవుతుందని, గ్రామీణ ప్రాంత మహిళలకు ఇలాంటి ఉచిత స్క్రీనింగ్ కార్యక్రమాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని అన్నారు. ఏపీఎం నారాయణ మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులు, గ్రామీణ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వైద్య పరీక్షలు అందుబాటులోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గ్రామ సర్పంచ్ సురేందర్ మాట్లాడుతూ, గ్రామంలోని మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకన్న, సీసీ అరుణతో పాటు వివిధ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, భవిష్యత్‌లో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని వారు పేర్కొన్నారు.

# ప్రతి సొసైటీకి కొత్త పంట రుణాల కింద రూ.10 లక్షలు కేటాయింపు

### వరంగల్ డీసీసీబీ మహాజనసభలో కీలక నిర్ణయాలు



**హన్మకొండ, అక్టోబర్ 27(జై భీమ్ న్యూస్)**

ప్రతి సొసైటీకి కొత్త పంట రుణాల కింద రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పర్సన్-ఇన్‌ఛార్జి (పిఐసి) కమిటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి తెలిపారు. మంగళవారం హనుమకొండలో ఆమె అధ్యక్షతన వరంగల్ డీసీసీబీ మహాజనసభ సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ సర్టిఫికేషన్, వార్షిక ఆర్థిక నివేదికలు, బ్యాలెన్స్ షీట్, లాభనష్టాల ఖాతా, నికర లాభాల వినియోగం, ఆడిటర్ల నియామకం తదితర అంశాలను పరిశీలించారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ.10.23 కోట్ల నికర లాభాన్ని సాధించినట్లు అధికారులు వెల్లడించారు. సభ్య ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పీఏసీఎస్) రూ.1.53 కోట్ల డివిడెండ్ ప్రకటించారు. 50 శాతానికి పైగా రికవరీ సాధించిన అర్హత కలిగిన సొసైటీలకు రూ.50 లక్షల వరకు, మిగిలిన ఏ, బీ కేటగిరీ ఆడిట్ ర్యాంకింగ్ సొసైటీలకు రూ.30 లక్షల వరకు దీర్ఘకాలిక రుణాల (ఎల్‌టీ లోన్స్) సదుపాయం కల్పించే అంశాన్ని కలెక్టర్ వెల్లడించారు. ప్రతి సొసైటీకి కొత్త పంట రుణాల కింద రూ.10 లక్షలు కేటాయించనున్నట్లు తెలిపారు. రుణ బకాయిదారులకు ఉపశమనం కల్పించేందుకు అమలు చేస్తున్న వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకాన్ని 2027 మార్చి 31 వరకు పొడిగించినట్లు సమావేశంలో తెలిపారు. బ్యాంకు శాఖల విస్తరణలో భాగంగా భూపాలపల్లి, ములుగు, ఘనపూర్ శాఖల భవనాల నిర్మాణానికి స్థల కేటాయింపు ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడించారు. గూడూరు బ్రాంచ్‌కు చెందిన కస్టమర్ కంచె సునీల్ ప్రమాదవశాత్తు మృతి చెందిన నేపథ్యంలో ప్రమాద మరణ బీమా క్లెయిమ్ కింద రూ.2 లక్షల పరిహారం చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. కొన్ని సొసైటీల ప్రతినిధులు బ్యాంకు అనుబంధం (అఫిలియేషన్)కు సంబంధించి సమావేశంలో ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై అదనపు కలెక్టర్ ఎన్. రవి, పీఐసీ కమిటీ సభ్యులు సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అంశాలను పరిశీలిస్తామని తెలిపారు. సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం, రుణ సదుపాయాలను విస్తరించడం, రుణాల రికవరీని మెరుగుపరచడం, రైతులకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో బ్యాంకు డీఆర్/ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు, జీఎం ఉషాశ్రీ, అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ డీసీఓ బి. మోహన్, సీఈఓ మహ్మద్ వజీర్ సుల్తాన్, వరంగల్ డీసీఓ నిరజ, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, భూపాలపల్లి డీసీఓ వల్యా నాయక్, మహబూబాబాద్ డీసీఓ సర్దార్ సింగ్‌తో పాటు పీఏసీఎస్ అధ్యక్షులు, ప్రతినిధులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# ఆర్నాబ్ తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

### ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాలు

**వరంగల్, 27 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఆర్నాబ్ తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. భారత వాతావరణ శాఖ నివేదికల ఆధారంగా వరంగల్ జిల్లాకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో మంగళవారం జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ముందస్తు జాగ్రత్త చర్యలపై దిశానిర్దేశం చేశారు.జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ వర్షాల పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

**లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా**

జిల్లాలోని ప్రమాదకర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన సహాయక, పునరావాస ఏర్పాట్లను సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు.

**సహాయక బృందాలు సిద్ధంగా ఉండాలి**

జిల్లా అగ్నిమాపక అధికారి, మామునూరులోని నాలుగో బెటాలియన్ రాష్ట్ర విపత్తు స్పందన దళం కమాండెంట్ తమ బృందాలను, అవసరమైన పరికరాలను తక్షణ సహాయక చర్యలకు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే పరికరాలు, వాహనాలు, సిబ్బంది, ఇతర విపత్తు నిర్వహణ వనరులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో సమాచార మార్పిడి కొనసాగిస్తూ, అవసరమైన చర్యలను వేగంగా చేపట్టాలని ఆదేశించారు.

**24 గంటల పాటు కంట్రోల్ రూమ్ సేవలు**

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3424, ఫోన్ నంబర్ 9154252936 అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సేవలు 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ప్రజలు వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలు, వరద ప్రవాహం ఉన్న ప్రదేశాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కోరారు. అధికారుల సూచనలను పాటిస్తూ విపత్తు నిర్వహణ యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అధ్యాపక ఖాళీలను భర్తీ చేయాలి



### మూడు నెలలుగా ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ లెక్చరర్ పోస్టు

### లెక్చరర్లు లేక కన్స్ట్రక్షన్ టెక్నాలజీ కోర్సు ఎత్తివేతపై డీఎస్ఏ ఆగ్రహం

**హన్మకొండ, అక్టోబర్ 27(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ పట్టణంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్ఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు డీఎస్ఏ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ మాట్లాడుతూ.. కళాశాలలో గత మూడు నెలలుగా ఇంగ్లీష్ లెక్చరర్ పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. దాదాపు సగానికి పైగా కోర్సులకు ఒక్కొక్క లెక్చరర్ మాత్రమే ఉండటం వల్ల విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రభావం పడుతోందని అన్నారు. లెక్చరర్ అందుబాటులో లేకపోవడంతో కన్స్ట్రక్షన్ టెక్నాలజీ కోర్సును ఎత్తివేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని శ్రావణ్ విమర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు తమ సమస్యలను తెలియజేయడానికి డీఐఈఓ కార్యాలయానికి వచ్చిన సమయంలో సంబంధిత అధికారి అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. కళాశాలలోని సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని తెలిపారు. డీఐఈఓ కార్యాలయాన్ని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రాంగణం నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని డీఎస్ఏ జిల్లా కన్వీనర్ డిమాండ్ చేశారు. కళాశాలలో ఖాళీగా ఉన్న అన్ని అధ్యాపక పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ జిల్లా నాయకులు కమల్ రెడ్డి, వెంకటేష్, గోవర్ధన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీల్లో ఆకస్మిక తనిఖీలు

### ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి: డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య





**హన్మకొండ, అక్టోబర్ 27(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మంగళవారం శాయంపేట, దామెర, సిద్ధాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీల్లో అందుతున్న వైద్య సేవలు, రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాల్లోని రికార్డులు, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. వైద్యులు, సిబ్బంది విధులకు సమయపాలనతో హాజరై ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీల్లో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని డీఎంహెచ్ఓ సమీక్షించారు. తల్లి, శిశు ఆరోగ్య సేవలు (ఎంసీహెచ్), అసంక్రమిత వ్యాధుల నియంత్రణ (ఎన్‌సీడీ), టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. క్షయవ్యాధి అనుమానితులను ముందుగానే గుర్తించి పరీక్షలు నిర్వహించాలని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి సకాలంలో చికిత్స అందిస్తూ చికిత్స పూర్తయ్యే వరకు పర్యవేక్షించాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న కుష్టు వ్యాధి కేసుల గుర్తింపు సర్వే (ఎల్‌సీడీసీ)ను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే ద్వారా అనుమానితులను గుర్తించి అవసరమైన పరీక్షలు, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే అంగవైకల్యాన్ని నివారించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ సూచించారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. నీటి నిల్వలను తొలగించడం, దోమల లార్వా వృద్ధిని అరికట్టడం, యాంటీ లార్వా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేలా వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు అందించే వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో డాక్టర్ ఎన్. సాయికృష్ణ, డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రీపాల్‌తో పాటు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# ట్రైసిటీ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవకుల సహవాస కూడిక విజయవంతం

### క్రైస్తవ సేవకులకు ఆధ్యాత్మిక సందేశం.. ముఖ్య అతిథిగా కొడవటి రవి





**వరంగల్, 27 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ త్రినగర క్రైస్తవ సేవకులకు శుభాభివందనాలు. ట్రైసిటీ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెవరెండ్ సువర్ణ రాజు ప్రార్థన మందిరంలో నిర్వహించిన సేవకుల సహవాస కూడిక విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు పాస్టర్లు, క్రైస్తవ నాయకులు, సేవకులు హాజరై ఆధ్యాత్మిక సహవాసంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాయకులు కొడవటి రవి క్రైస్తవ సమాజానికి, సేవకులకు అవసరమైన విలువైన సందేశాన్ని అందించారు. క్రైస్తవ సేవకులకు ఆధ్యాత్మికంగా దిశానిర్దేశం చేసే అంశాలను తన సందేశంలో వివరించారు. ముఖ్య ప్రసంగీకులుగా హైదరాబాద్‌కు చెందిన స్వామి క్రీస్తు సంఘం ప్రతినిధి పాల్గొని బైబిల్ వాక్య సందేశాన్ని అందించారు. ఈ సమావేశానికి ట్రైసిటీ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ బాషి పాకాల ఏలియా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జాన్ దేస్, విల్సన్, యోబు, విలియం, ఐజాక్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు పాస్టర్లు, క్రైస్తవ సేవకులు పెద్ద సంఖ్యలో హాజరై సహవాస కూడికను విజయవంతం చేశారు. క్రైస్తవ సేవకుల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, ఆధ్యాత్మిక అభివృద్ధికి తోడ్పడటం, దేవుని సేవలో పరస్పర సహకారాన్ని పెంపొందించడం ఈ సహవాస కూడిక ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడంతో త్రినగర క్రైస్తవ సమాజం తరఫున సంతోషం వ్యక్తం చేశారు.

# గ్రామస్థాయిలో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి చర్యలు

### ఎమ్మెల్యే రేవూరి ఆదేశాలతో యువత సైనికుల్లా పనిచేయాలి
### పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్
### ఆత్మకూరు మండలంలో నూతన గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం



**ఆత్మకూరు, 27 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రామస్థాయి నుంచి యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తూ, పార్టీ లక్ష్యాల సాధనకు యువత క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ పిలుపునిచ్చారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల్లో నూతన గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. గ్రామ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమక్షంలో ఈ నియామకాలు చేపట్టారు. ఈ సందర్భంగా మాదాసి శ్రీధర్ మాట్లాడుతూ, కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలకు విఘాతం కలిగిస్తోందని విమర్శించారు. మత, కుల విభేదాలను ప్రోత్సహిస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై శ్రీధర్ విమర్శలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో యువత పార్టీ సైనికుల్లా పనిచేయాలని కోరారు. గ్రామస్థాయిలో పార్టీ కమిటీల ఏర్పాటు ద్వారా యువతను రాజకీయ కార్యకలాపాల్లో భాగస్వాములను చేయడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాటాలను బలోపేతం చేయాలని నాయకులు సూచించారు. ఈ సమావేశంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవూరి జలంధర్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పర్వతగిరి మహేశ్వరి రాజు, పీఏసీఎస్ చైర్మన్ ఎగితే లింగయ్య, ఆత్మకూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తనుగుల సందీప్, గఫూర్, మౌలా, రాజేందర్, రమేష్, గ్రామ అధ్యక్షులు తాళ్ల కిరణ్, అర్షం కుమారస్వామి, ఎలగొండ లింగమూర్తి, మంగ రాజు, సీనియర్ నాయకుడు పరికరాల వాసు, డైరెక్టర్లు వెల్దే వెంకటేశ్వర్లు, రవి, ఉడత మహేందర్, రాజేందర్, నీలం రాజు, కుమారస్వామి, యూత్ నాయకులు పిట్టల రాజకుమార్, కరీం తదితరులు పాల్గొన్నారు.

# తీగరాజుపల్లిలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం పనుల పరిశీలన





### లెప్రసీ కేసుల గుర్తింపు సర్వే పర్యవేక్షణ.. ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీలు

**వరంగల్, అక్టోబర్ 27(జై భీమ్ న్యూస్)**

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాల అమలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సంగెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తీగరాజుపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (ఏఏఎం)ను సందర్శించిన డాక్టర్ రాజా రెడ్డి అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. స్థానిక సర్పంచ్, నిర్మాణ కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనుల పురోగతిని సమీక్షించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం తీగరాజుపల్లి పరిధిలో నిర్వహిస్తున్న లెప్రసీ కేసుల గుర్తింపు కార్యక్రమం (ఎల్‌సీడీసీ) ఇంటింటి సర్వేను ఆయన పర్యవేక్షించారు. ప్రతి ఇంటినీ సందర్శించి కుష్టు వ్యాధికి సంబంధించిన అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనుమానిత కేసులు గుర్తించినప్పుడు తదుపరి పరీక్షలు, నిర్ధారణ, అవసరమైన వైద్య సేవల కోసం సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేయాలని ఆదేశించారు. కుష్టు వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్లినిక్‌ను కూడా డాక్టర్ రాజా రెడ్డి తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను సమీక్షించి, ఔట్ పేషెంట్ రిజిస్టర్, ల్యాబొరేటరీ రిజిస్టర్, ఐస్ లైన్డ్ రెఫ్రిజిరేటర్ (ఐఎల్ఆర్)ను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, ప్రయోగశాల సేవలు, టీకాల నిల్వకు సంబంధించిన కోల్డ్‌చైన్ నిర్వహణపై ఆరా తీశారు. ఆరోగ్య మహిళా క్లినిక్‌కు వచ్చే మహిళలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన పరీక్షలను సక్రమంగా నిర్వహించి రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలోని పనితీరు సూచికలను సమీక్షిస్తూ మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డాక్టర్ రాజా రెడ్డి ఓపీ, ఫార్మసీ, ల్యాబొరేటరీతో పాటు వివిధ విభాగాలను తనిఖీ చేశారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తూ పనితీరును మరింత మెరుగుపరచాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించేందుకు వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ బి. రాజా రెడ్డి కోరారు. ఈ తనిఖీల్లో సంగెం వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, తీగరాజుపల్లి వైద్య సిబ్బంది, పర్వతగిరి వైద్యాధికారులు డాక్టర్ వి. ఉదయ్ రాజ్, డాక్టర్ జె. మౌనిక, రాయపర్తి వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్‌తో పాటు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో పునరావాస కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే కొండబాబు

### బాధితులకు అందుతున్న సహాయక చర్యలపై ఆరా.. ప్రజల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచన

**కాకినాడ, 27 అక్టోబర్ 2026 (జెవి న్యూస్)**

ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో కాకినాడ నగరంలో భారీ వర్షాలు, ఈదురుగాలులు కురుస్తున్న నేపథ్యంలో తుఫాన్ బాధితుల సహాయార్థం ఏర్పాటు చేసిన పలు పునరావాస కేంద్రాలను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సందర్శించారు. కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, సహాయక చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు చేపడుతున్న చర్యలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అనంతరం జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలతో మాట్లాడిన ఎమ్మెల్యే, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో కొనసాగుతున్న సహాయక చర్యల వివరాలను తెలుసుకున్నారు. ప్రజల ప్రాణరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో



బాధితులకు తక్షణ సహాయం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్ కే. శ్రీనివాస్, అర్బన్ తహసీల్దార్ వి. జితేంద్ర, ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణన-2027 రెండో దశ జనాభా గణనపై అధికారులకు శిక్షణ






### ఖచ్చితమైన గణాంకాలే సమర్థవంతమైన అభివృద్ధికి పునాది
### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, 27 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

జనగణన--2027 కార్యక్రమంలో భాగంగా రెండో దశ జనాభా గణన నిర్వహణపై జిల్లా, ఉపజిల్లా, గణన విభాగాల అధికారులకు ఈ నెల 27, 28 తేదీల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజల నుంచి సేకరించే సమాచారం ఖచ్చితంగా, నిష్పక్షపాతంగా ఉండేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. జనగణన ద్వారా సేకరించే గణాంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు కీలక ఆధారంగా నిలుస్తాయని పేర్కొన్నారు. జనాభా గణనలో సమాచార సేకరణ, నమోదు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ప్రతి వివరాన్ని జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో జనగణన నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ముందస్తు అవగాహన అవసరమని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన జిల్లా జనగణన కార్యకలాపాల విభాగం శిక్షణ అధికారి సతీష్ అధికారులకు శిక్షణ అందించారు. జనాభా గణన విధివిధానాలు, సమాచార నమోదు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సందేహాల నివృత్తి, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. జనగణన విధివిధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకుని, క్షేత్రస్థాయిలో జనాభా గణనను సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వై.వి. గణేష్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట రెవెన్యూ డివిజనల్ అధికారులు సుమ, ఉమారాణి, ముఖ్య ప్రణాళిక అధికారి పి. చంద్రకళ, సంబంధిత మండలాల తహసీల్దార్లు, శిక్షణ అధికారి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ పర్యాటక సర్క్యూట్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు

**'ది వీక్ హెరిటేజ్ అవార్డ్స్-2026'లో హెరిటేజ్ టూరిజం విభాగంలో సిల్వర్ బన్యన్ పురస్కారం**



**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 27 (జై భీమ్ న్యూస్) :**

తెలంగాణ పర్యాటక రంగానికి మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. వరంగల్, హన్మకొండ, ములుగు జిల్లాలతో కూడిన పర్యాటక సర్క్యూట్‌కు 'ది వీక్ హెరిటేజ్ అవార్డ్స్--2026'లో హెరిటేజ్ టూరిజం విభాగంలో 'బెస్ట్ టూరిస్ట్ సర్క్యూట్ / బెస్ట్ టూరిస్ట్ ట్రైల్' కేటగిరీలో సిల్వర్ బన్యన్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి మ్యూజియం అండ్ లైబ్రరీలో అక్టోబర్ 27న నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈ అవార్డును ప్రదానం చేశారు.తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరు క్రాంతి మార్గదర్శకత్వంలో రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహించేందుకు చేపడుతున్న ప్రయత్నాలకు ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచింది.

**కాకతీయ వైభవం నుంచి ప్రకృతి అందాల వరకు**

కాకతీయుల చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ కోట, కాకతీయ కళాతోరణం, వేయి స్తంభాల గుడి, భద్రకాళి దేవాలయం ఈ పర్యాటక సర్క్యూట్‌లో ప్రధాన ఆకర్షణలుగా ఉన్నాయి. యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం కాకతీయుల అద్భుత శిల్పకళ, నిర్మాణ నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ములుగు ప్రాంతంలోని లక్నవరం సరస్సు, సస్పెన్షన్ బ్రిడ్జి, పచ్చని ప్రకృతి దృశ్యాలు పర్యాటకులను ఆకట్టుకుంటుండగా, బొగత జలపాతం ప్రకృతి ప్రేమికులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తోంది. ఈ ప్రాంతంలోని గిరిజన సంస్కృతి, చేనేత సంప్రదాయాలు, స్థానిక జీవన విధానాలు కూడా పర్యాటక సర్క్యూట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

**పర్యాటక సదుపాయాల అభివృద్ధికి చర్యలు**

పర్యాటకులకు మెరుగైన అనుభవాన్ని అందించేందుకు హరిత హోటళ్లు, రిసార్టులు, బోటింగ్ సదుపాయాలు, రవాణా అనుసంధానం, సందర్శకులకు అవసరమైన వసతుల అభివృద్ధిపై తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ దృష్టి సారిస్తోంది. వరంగల్, రామప్ప దేవాలయం, లక్నవరం సరస్సు, బొగత జలపాతాన్ని అనుసంధానిస్తూ ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలను ప్రోత్సహిస్తోంది.రాష్ట్ర ప్రభుత్వ 'తెలంగాణ జారూర్ ఆనా' ప్రచార కార్యక్రమం ద్వారా తెలంగాణ చారిత్రక సంపద, ప్రకృతి సౌందర్యం, సాంస్కృతిక వైవిధ్యాన్ని దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు పరిచయం చేస్తున్నారు.ఈ అవార్డు ఉమ్మడి వరంగల్ ప్రాంత పర్యాటక ప్రాధాన్యతను మరింత పెంచడంతో పాటు, స్థానిక పర్యాటక అభివృద్ధికి, ఉపాధి అవకాశాల విస్తరణకు దోహదపడే అవకాశముంది. కాకతీయ వారసత్వం, ఆధ్యాత్మిక కేంద్రాలు, ప్రకృతి అందాలను ఒకే పర్యాటక మార్గంలో అనుసంధానించిన వరంగల్--హన్మకొండ--ములుగు సర్క్యూట్‌కు లభించిన ఈ గుర్తింపు తెలంగాణ పర్యాటక రంగానికి గర్వకారణంగా నిలిచింది.

# టీడీపీలో చేరిపోయిన పేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి !

**గుంటూరు, అక్టోబర్ 27 (జై భీమ్ న్యూస్) :**

పల్నాడు రాజకీయాల్లో మాజీ మంత్రి విడదల రజిని రాజకీయం నవ్వులపాలైంది. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల వేళ.. పోలీసులు తనను కింద పడేశారని, అడ్డుకున్నారని ఒక పెద్ద సెంటిమెంట్ డ్రామాకు తెరతీసిన ఆమె, ఇంట్లోనే కూర్చుని పరామర్శల రాజకీయం చేస్తున్నారు. సానుభూతి పొందేందుకు వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలందరినీ తన వద్దకు పరామర్శలకు పిలిపించుకుంటూ లైవ్ కవరేజీలతో రచ్చ చేశారు. అయితే రజిని ఈ పరామర్శల పర్వంలో మునిగి తేలుతున్న సమయంలోనే, క్షేత్రస్థాయిలో పార్టీకి జరగాల్సిన అసలు నష్టం జరిగిపోయింది.విడదల రజిని ఒకవైపు సెంటిమెంట్ పొలిటికల్ గేమ్ ఆడుతుంటే,మరొకవైపు ఆమె ఎంతో నమ్మకంగా బరిలో నిలిపిన అభ్యర్థులే ఇదే సందు అనుకుని సైలెంట్‌గా గోడ దూకేశారు. చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా రజిని ప్రతిపాదించిన కరీమూన్ ఏకంగా వైఎస్సార్‌సీపీకి హ్యాండ్ ఇచ్చి తెలుగుదేశం పార్టీ కండువా కప్పేసుకున్నారు. అంతేకాకుండా, టిడిపి అభ్యర్థి గెలుపు కోసం స్వయంగా ప్రచారంలోకి దిగడం వైఎస్సార్‌సీపీ శ్రేణులను కోలుకోలేని దెబ్బతీసింది.మున్సిపల్ ఎన్నికల్లో కరీమూన్‌తో నామినేషన్ వేయించడం, అది ఉపసంహరణ కాకుండా చూసుకోవడం వరకే విడదల రజిని శ్రద్ధ చూపించారు. కానీ, సదరు నాయకురాలు తమ వైపే ఉందా లేదా, క్షేత్రస్థాయిలో పార్టీకి విధేయంగా ఉందా అనే విషయాన్ని గమనించడంలో రజిని ఘోరంగా విఫలమయ్యారు. పోటీ నుంచి ఉపసంహరించుకోకుండా జాగ్రత్తపడిన రజిని, కరీమూన్ టిడిపిలోకి క్యూ కట్టకుండా మాత్రం ఆపలేకపోయారు. దీంతో వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను నెరవేర్చడంలో ఆమె అసమర్థత మరోసారి బయటపడింది.పోలీసులతో వివాదాన్ని ఆసరాగా చేసుకుని విక్టిమ్ కార్డ్ ఉపయోగించి రాజకీయ లబ్ధి పొందాలనుకున్న విడదల రజిని వ్యూహం తుస్సుమంది. ఒకవైపు తాను ఇంట్లో కూర్చుని సెంటిమెంట్ డ్రామాలతో కాలక్షేపం చేస్తుంటే, తన చేతుల మీదుగా టికెట్ పొందిన కీలక అభ్యర్థే ప్రత్యర్థి కూటమిలో చేరి ప్రచారం చేసుకోవడం రజిని రాజకీయ భవిష్యత్తు దెబ్బీసింది. సొంత నియోజకవర్గంలోనే అభ్యర్థులను కాపాడుకోలేని నాయకురాలు రాష్ట్రస్థాయిలో వైఎస్సార్‌సీపీని ఏం నడిపిస్తుందంటూ సొంత పార్టీ కేడరే పెదవి విరుస్తోంది

**ఒంగోలులో ఎన్నికల బరిలో జెన్ జీ.**

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నగరా మోగిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ముందుగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించనున్నారు. నవంబర్ 1న 100 అర్బన్ లోకల్ బాడీల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాగా.. అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నం అయ్యారు. స్థానిక ఎన్నికల్లో పోటీకి జెన్ జీ యువత కూడా ఆసక్తి కనబరుస్తోంది. ఒంగోలులో 24 ఏళ్ల చావలి చర్విత కార్పొరేటర్‌గా పోటీ చేస్తున్నారు.ఎంటెక్ చదివిన చర్విత ఉద్యోగం చేసుకొందామని భావించకుండా.. రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఒంగోలు 27వ డివిజన్ నుంచి కూటమి తరపున టీడీపీ అభ్యర్థిగా ఆమె నామినేషన్ దాఖలు చేశారు. ఈ డివిజన్ బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో.. యాదవ సామాజికవర్గానికి చెందిన ఆమె బరిలో నిలిచారు. ఆమె ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ సైన్స్ అండ్ టెక్నాలజీలో చదువుకున్నారు.తమది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం అన్న చర్విత.. తన తాతయ్య చావలి కృష్ణయ్య గతంలో కౌన్సిలర్‌గా పని చేశారన్నారు. తమ కుటుంబానికి టీడీపీతో 40 ఏళ్లకుపైగా అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తేళ్లకుల అనంతమ్మ ప్రస్తుతం అన్నవరం దేవస్థానం బోర్డు డైరెక్టర్‌గా పని చేస్తున్నారన్నారు. వీళ్ల స్ఫూర్తితోనే తాను చదువు పూర్తయ్యాక రాజకీయాల్లోకి అడుగుపెట్టానన్నారు. తనకు టికెట్ రావడానికి ఎమ్మెల్యే దామరచర్ల జనార్ధన్ కారణమని చర్విత చెప్పారు. 27వ డివిజన్‌ను ఒంగోలులోనే ది బెస్ట్ డివిజన్‌గా నిలుపుతానన్నారు. ప్రజలకు ఏం చేస్తే బాగుంటుందనేది తాను నిత్యం ఆలోచిస్తుంటానన్నారు.ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల్లో ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా టీడీపీకి చెందిన నల్లమిల్లి శ్రీశిల్ప బరిలోకి దిగారు. వైసీపీ తరఫున ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్ బరిలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు ఇండిపెండెంట్ మేయర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయగా.. ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. అధికారుల తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎన్నికల బరిలో నుంచి తన పేరును తొలగించారని, తనకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించకపోతే న్యాయపోరాటానికి దిగుతానని ఆయన హెచ్చరించారు.2021లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఒంగోలు కార్పొరేషన్‌ను వైసీపీ గెలుచుకుంది. వైసీపీ 41, టీడీపీ 6, జనసేన 1, స్వతంత్రులు రెండు స్థానాల్లో గెలిచారు. అయితే 2024 ఎన్నికల తర్వాత ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో మేయర్, డిప్యూటీ మేయర్ సహా 17 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. దీంతో ఈ కార్పొరేషన్ టీడీపీ వశమైంది.

# గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రాజెక్టుకు మోదీ పచ్చ జెండా

**ఒంగోలు, అక్టోబర్ 27 (జై భీమ్ న్యూస్) :**

ఏపీకి కేంద్రం భారీ చేయూత అందింది. రాష్ట్రంలో విద్యుత్ ప్రసార వ్యవస్థను ఆధునికీకరించే దిశగా రూ.27,370 కోట్ల వ్యయంతో చేపట్టే 'గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రాజెక్టుకు మోదీ సర్కార్ పచ్చ జెండా ఊపింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 7,872 సర్క్యూట్ కిలోమీటర్ల మేర కొత్త కరెంట్ లైన్లను వేసేందుకు, అలాగే రామాయపట్నం, కొప్పాక ప్రాంతాల్లో కొత్తగా 400 కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటుకు కూడా కేంద్రం ఆమోదం తెలిపింది.అనుకున్న విధంగా ఈ గ్రీన్ కారిడార్ ప్రాజెక్ట్ పట్టాలు ఎక్కితే... చాలా రకాల ప్రయోజనాలు ఉంటాయి.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం భారీ సాయం అందించింది. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన రంగానికి కేంద్రం భారీ ఊతం ఇచ్చింది. రాష్ట్రంలో విద్యుత్ ప్రసార వ్యవస్థను ఆధునికీకరించే దిశగా ఏకంగా రూ.27,370 కోట్ల వ్యయంతో చేపట్టే 'గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రాజెక్టుకు మోదీ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సోలార్, పవన విద్యుత్‌తో పాటు పంప్డ్ స్టోరేజ్ ద్వారా ఉత్పత్తి అయ్యే కరెంట్‌ను నేరుగా మెయిన్ గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 7,872 సర్క్యూట్ కిలోమీటర్ల మేర కొత్త కరెంట్ లైన్లను వేసేందుకు, అదే విధంగా రామాయపట్నం, కొప్పాక ప్రాంతాల్లో కొత్తగా 400 కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటుకు కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. వీటి ద్వారా మొత్తం 9,500 ఓఎం అదనపు విద్యుత్ ప్రసార సామర్థ్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా తీరప్రాంతాల్లోని పోర్టులు, పారిశ్రామిక వాడలకు నిరంతర, నాణ్యమైన కరెంట్‌ను అందించాలన్న లక్ష్యంతో రామాయపట్నం సబ్‌స్టేషన్ కీలకంగా మారనుంది. ఈ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పనులన్నింటినీ 2029-30 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్లాన్ చేసింది.అనుకున్న విధంగా ఈ గ్రీన్ కారిడార్ ప్రాజెక్ట్ పట్టాలు ఎక్కితే... చాలా రకాల ప్రయోజనాలు ఉంటాయి. ఇందులో ఏర్పాటు చేసే భారీ బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థల ద్వారా పగటి పూట ఉత్పత్తి అయిన కరెంట్‌ను స్టోరేజ్ చేసి రాత్రి పూట లేదా డిమాండ్ ఎక్కువగా ఉన్న సమయంలో వాడుకోవచ్చు. దీంతో ఎండాకాలంలో తరచుగా ఎదుర్కొనే పవర్ కట్స్ తగ్గుతాయి. అదే విధంగా గాలి, సూర్యరశ్మితో ఉత్పత్తి చేసే కరెంట్ ద్వారా చౌకగా లభిస్తుంది.ఈ మేరకు సామాన్యుల కరెంటు బిల్లుల పెంపు భారం తగ్గుతుంది. శిలాజ ఇంధనాల వాడకం తగ్గడం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. ఈ భారీ కారిడార్, బ్యాటరీ ప్లాంట్ల నిర్మాణం వల్ల పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. అంటే ఈ ప్రాజెక్ట్ వల్ల పరోక్షంగా, ప్రత్యక్షంగా కూడా అనేక ఉపయోగాలు ఉంటాయి.

# ఏకగ్రీవాల వివరాలు, పార్టీల బలాబలాలు

**విజయవాడ, అక్టోబర్ 27 (జై భీమ్ న్యూస్) :**

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ జరగడానికి ముందే అధికార కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. రాష్ట్రంలోని 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు ఎన్నికలు జరుగుతుండగా, ఎన్నికలు జరగకముందే 17 పురపాలక సంఘాల్లో కూటమి అభ్యర్థులు చైర్‌పర్సన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ అభ్యర్థులు 15 మంది, జనసేన, బీజేపీల నుంచి ఒక్కొక్కరి చొప్పున మొత్తం 17 మంది ఛైర్‌పర్సన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లోని డివిజన్లు, వార్డులలో కలిపి కూటమికి చెందిన 726 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా గెలుపొంది సత్తా చాటారు. రాష్ట్రవ్యాప్తంగా ఏకగ్రీవమైన మొత్తం స్థానాల్లో టీడీపీ 660, జనసేన 38, బీజేపీ 28 స్థానాల్లో విజయం సాధించగా, వైసీపీ 19, సీపీఐ 1, స్వతంత్రులు 5 స్థానాలను ఏకగ్రీవంగా దక్కించుకున్నారు. సగటున మొత్తం వార్డుల్లో 21.08 శాతం, డివిజన్లలో 12.58 శాతం స్థానాలు ఏకగ్రీవమయినట్లు తెలుస్తోంది. ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత జిల్లాలో 8 పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు ఎన్నికలు జరుగుతుండగా, అందులో 6 చోట్ల కూటమి అభ్యర్థులే ఏకగ్రీవంగా ఛైర్‌పర్సన్లుగా ఎన్నిక కావడం రాజకీయంగా ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ. కడప నగరపాలక సంస్థలో మొత్తం 66 డివిజన్లలో 50 డివిజన్లు ఏకగ్రీవం కాగా, కేవలం 16 డివిజన్లలో పోలింగ్ జరగనుంది.పులివెందులలో మొత్తం 40 వార్డులు ఉండగా, 20 వార్డులు కూటమికి ఏకగ్రీవమయ్యాయి. పుంగనూరు, నగరి విషయానికి వస్తే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి నియోజకవర్గం పుంగనూరులోనూ, చిత్తూరు జిల్లా నగరి పురపాలక సంఘంలోనూ చైర్‌పర్సన్ పదవులు టీడీపీకి ఏకగ్రీవమయ్యాయి.మొత్తం 13 నగరపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తుండగా, 6 కార్పొరేషన్ల పరిధిలోని 116 డివిజన్లు ఏకగ్రీవమయ్యాయి. అందులో టీడీపీ 109, జనసేన 3, బీజేపీ 3, వైసీపీ 1 స్థానాన్ని దక్కించుకున్నాయి. ఇక 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో మొత్తం 637 వార్డులు ఏకగ్రీవం కాగా.. అందులో టీడీపీ 553, జనసేన 35, బీజేపీ 25, వైసీపీ 18, సీపీఐ 1, స్వతంత్రులు 5 స్థానాలను ఏకగ్రీవంగా గెలుచుకున్నారు.

# వైసీపీ అభ్యర్థులకు ఆర్థికకష్టాలు

**కర్నూలు, అక్టోబర్ 27 (జై భీమ్ న్యూస్) :**

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచీ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వైఖరి, ఇప్పుడు క్షేత్రస్థాయి క్యాడర్‌ను తీవ్ర గందరగో ళంలోకి నెట్టేసింది. "రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోతోంది, తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వడం లేదు అంటూ గవర్నర్‌కు ఫిర్యాదులు, మీడియా ముందు ప్రెస్‌మీట్లతో నానా హంగామా సృష్టించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. తీరా ఎన్నికల రణక్షేత్రం వేడెక్కుతున్న తరుణంలో యథావిధిగా బెంగళూరు ప్యాలెస్‌కు వెళ్లిపోయారు. అధినేత చేసిన ఆరోపణలకు పూర్తి భిన్నంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90 శాతానికి పైగా స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు యథేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేయడం, ఒకవైపు అసత్య ప్రచారాన్ని బట్టబయలు చేస్తూనే, మరోవైపు నాయకత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోంది.స్థానిక ఎన్నికల్లో ఎవరైనా ప్రత్యర్థులకు స్థానాలు ఏకగ్రీవం చేస్తే, భవిష్యత్ అసెంబ్లీ , సార్వత్రిక ఎన్నికల్లో వారికి ఎట్టిపరిస్థితుల్లోనూ పార్టీ టికెట్లు ఇచ్చేది లేదని జగన్ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. దీంతో తమ రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు కొందరు, మరికొందరు స్థానిక టీడీపీ నేతలతో తెరవెనుక చర్చలు జరిపి వ్యక్తిగత ప్రయోజనాలు , హామీలు పొందే వ్యూహంతో నామినేషన్లు వేయించినట్లు స్పష్టమవుతోంది. నామినేషన్ల సంఖ్య భారీగానే కనిపించినప్పటికీ, అందులో ప్రజాబలంతో పాటు అంతర్గత బేరసారాల వ్యూహాలే ఎక్కువ పాత్ర పోషించాయన్న వాదన బలంగా వినిపిస్తోంది.నామినేషన్లు వేయడం ఒక ఎత్తైతే, ఆ తర్వాత సీరియస్‌గా బరిలో నిలబడి ప్రజల్లోకి వెళ్లాలనుకున్న అసలైన క్యాడర్ పరిస్థితి మాత్రం దయనీయంగా మారిపోయింది. పోరుబాట పట్టిన అభ్యర్థులను వెనకుండి నడిపించే నాథుడే కరువయ్యారు. అధికారంలో ఉన్నప్పుడు అన్నీ అనుభవించి, కోట్లాది రూపాయల పదవులు అనుభవించిన జిల్లా స్థాయి ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఇప్పుడు ముఖం చాటేశారు. తమ సొంత ఇలాకాల్లో సైతం ఎన్నికల ఖర్చులకు రూపాయి విదల్చకుండా చేతులెత్తేశారు. కనీసం బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవడానికి, రోజువారీ ప్రచార రథాలు, కరపత్రాల ముద్రణకు కూడా జిల్లా నాయకత్వం నుంచి నయాపైసా ఆర్థిక సాయం అందకపోవడంతో క్షేత్రస్థాయి నాయకులు దిక్కుతోచని స్థితిలో ఒంటరి పోరాటం చేయాల్సి వస్తోంది.ముఖ్యంగా ప్రతిష్ఠాత్మక నగరాలైన విజయవాడ, విశాఖపట్నం, కడప వంటి మున్సిపల్ కార్పొరేషన్లలో పార్టీ తరఫున మేయర్ రేసులో నిలిచిన అభ్యర్థుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కార్పొరేషన్ స్థాయి ప్రచారం అంటే లక్షల్లో, కోట్లల్లో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ఆర్థికంగా దెబ్బతిన్న అభ్యర్థులు సొంత జేబుల్లోంచి నిధులు పెట్టే సాహసం చేయలేకపోతున్నారు. అటు పార్టీ పెద్దల నుంచి ఎటువంటి చేయూత లభించడం లేదు. దీనితో వీధుల్లో నామమాత్రపు మైకులతో తిరుగుతూ ప్రచారం చేస్తున్నామా లేదా అన్నట్లుగా కాలం వెళ్లదీస్తున్నారు. అధిష్ఠానం బెంగళూరులో కూర్చుని సోషల్ మీడియా ట్వీట్లతో సరిపెడుతుంటే, క్షేత్రస్థాయిలో తాము ఎందుకు బలపడాలన్న అసహనం అభ్యర్థుల్లో పెల్లుబుకుతోంది.ఈ ఆర్థిక స్తోమత లేమి, నాయకత్వపు అలసత్వం వెరసి చివరికి చాలా చోట్ల వైసీపీ అభ్యర్థులు అధికార కూటమి నేతలతో లాలూచీ పడే దిశగా అడుగులు వేయిస్తోంది. గెలిచే అవకాశాలు లేనప్పుడు సొంత ఆస్తులు అమ్ముకుని ఎన్నికల్లో తగలబెట్టడం కంటే.. అధికార పక్షంతో ఏదో ఒక రూపంలో సర్దుబాటు చేసుకుని నిశ్శబ్దంగా ఉండటమే శ్రేయస్కరమని పలువురు కౌన్సిలర్, కార్పొరేటర్ అభ్యర్థులు నిర్ణయించుకుంటున్నారు. ఎన్నికలను కేవలం రాజకీయ ప్రతీకార ప్రకటనలకే పరిమితం చేసి, పోరాడే సైనికులకు కవచాన్ని, ఆయుధాలను అందించని అధిష్ఠాన వైఖరి వల్లే ఈ పరిస్థితి దాపురించింది.

# కాకినాడ జనసేనలో తీవ్ర ఉద్రిక్తత..

కాకినాడ : కాకినాడ జిల్లా జనసేన పార్టీలో టికెట్ల కేటాయింపు వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. పెద్దాపురం మండల జడ్పీటీసీ అభ్యర్థి ఎంపికపై అధిష్టానం తీసుకున్న ఆకస్మిక నిర్ణయం పార్టీ శ్రేణుల్లో తీవ్ర అగ్గి రాజేసింది. పెద్దాపురం మండలం గుడివాడ గ్రామానికి చెందిన సీనియర్ జనసేన నాయకుడు అంబటి గంగాధర్, టికెట్ నిరాకరణపై తీవ్ర మనస్తాపానికి గురై ఎంపీ ఉదయ్ నివాసం ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పెద్దాపురం మండలం గురివాడ జడ్పీటీసీ అభ్యర్థిగా తొలుత అంబటి గంగాధర్ పేరును అధిష్టానం అధికారికంగా పరిశీలించి ఖరారు చేసినట్లు ప్రచారం జరిగింది. పార్టీ ఆవిర్భావం నుంచి గ్రామంలో పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేసిన గంగాధర్ తన ప్రచారాన్ని కూడా ప్రారంభించుకున్నారు. అయితే, నామినేషన్ల ఆఖరి ఘట్టంలో పార్టీ అధిష్టానం అనూహ్యంగా గంగాధర్‌ను పక్కనపెట్టి, ఆయన స్థానంలో బుర్రా దివ్య కి టికెట్ కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. తాను ఎంతో నమ్ముకున్న పార్టీ చివరి క్షణంలో నమ్మకద్రోహం చేసిందంటూ గంగాధర్ తీవ్ర క్షోభకు గురయ్యారు. ఆవేశంతో కాకినాడలోని ఎంపీ ఉదయ్ నివాసానికి చేరుకున్న ఆయన, తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించారు. వెంటనే అప్రమత్తమైన ఎంపీ భద్రతా సిబ్బంది, తోటి నాయకులు ఆయన చేతిలోని పెట్రోల్ డబ్బాను లాక్కొని పెను ప్రమాదాన్ని అడ్డుకున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# కందిపప్పు ఎక్కువగా తింటున్నారా..?



మన రోజువారీ ఆహారంలో కందిపప్పు ముఖ్యమైన భాగం. కానీ ఇటీవల కల్తీ సమస్య పెరుగుతోంది. కేసరి పప్పు అనే విషపూరిత పదార్థాన్ని దీనిలో కలుపుతున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది అంటున్నారు. మన ఆహారంలో ప్రోటీన్ ప్రధానమైన మూలకం. దానిని అందించేవాటిలో పప్పులు ముఖ్యమైనవి. అందులోను కందిపప్పు మన భారతీయ ఆహారంలో ప్రత్యేకమైన స్థానం కలిగి ఉంది. ముఖ్యంగా సాంబార్, పప్పు కూరలు తయారీలో కందిపప్పును విరివిగా ఉపయోగిస్తారు. కానీ ప్రస్తుతం దీనిలో కల్తీ ఎక్కువవుతోందనే సమాచారం ఆందోళన కలిగిస్తోంది. కేసరి పప్పు అనే రసాయనాలతో కలిపిన విషపూరిత పప్పును కల్తీ చేస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది ఆరోగ్యానికి హానికరమని, దీని వల్ల తీవ్రమైన నరాల సమస్యలు, క్యాన్సర్ వంటి జబ్బులు వస్తాయని సూచిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన పరిశోధనల్లో మార్కెట్లో లభిస్తున్న కందిపప్పులో కేసరి పప్పును కలుపుతున్నట్లు గుర్తించారు. ఈ కేసరి పప్పు అసలు తినదగినది కాదు. ఇది కలుపు మొక్కల ద్వారా పెరిగే విషపూరిత పదార్థం. దీన్ని తినడం వల్ల ముఖ్యంగా నరాల వ్యవస్థ దెబ్బతింటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీన్ని ఎక్కువగా తింటే కాళ్లు, చేతులు నెమ్మదిగా పని చేయకపోవడం, నడవలేకపోవడం లాంటి సమస్యలు వస్తాయి. దీన్ని లాథిరిజం అని అంటారు. దీని ప్రభావం శాశ్వతంగా ఉండే ప్రమాదం ఉంది. అంతేకాకుండా వ్యాపారులు ఈ కల్తీని గుర్తించకుండా ఉండేందుకు టార్ట్రాజిన్ అనే రసాయనాన్ని ఉపయోగిస్తున్నారు. ఇది ఒక రకమైన ఆహార రంగు పదార్థం. దీని వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. దీన్ని ఎక్కువగా తీసుకుంటే శరీరంలో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. దీని ప్రభావం దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. కేసరి పప్పు కందిపప్పును పోలి ఉంటుంది. అయితే దీని ఆకారం కొద్దిగా చతురస్రాకారంలో ఉంటుంది. కొంతమంది వ్యాపారులు తక్కువ ధరలో లభించే ఈ పప్పును అసలు కందిపప్పులో కలిపి అమ్ముతున్నారు. దీని వల్ల సామాన్య వినియోగదారులకు అసలు పప్పు, కల్తీ పప్పు మధ్య తేడా గుర్తించడం కష్టం అవుతోంది. ఇంట్లోనే ఈ పప్పులో కల్తీ ఉందో లేదో సులభంగా పరీక్షించుకోవచ్చు. దాని కోసం 10 గ్రాముల పప్పులో 25 మి.లీ నీరు పోసి, 5 మి.లీ హైడ్రోక్లోరిక్ ఆమ్లం వేసి చిన్న మంటపై వేడి చేయాలి. ఈ ప్రక్రియలో నీటి రంగు మారితే ఆ పప్పులో కల్తీ ఉందని అర్థం. అదనంగా సహజమైన కందిపప్పు నునుపుగా, గుండ్రంగా ఉంటుంది. అయితే కల్తీ కేసరి పప్పు త్రికోణాకారంలో ఉండే అవకాశం ఉంది. ప్రతిరోజు మనం తినే ఆహార పదార్థాలు మానవ ఆరోగ్యానికి ముప్పు కలిగించకూడదు. కాబట్టి నాణ్యమైన పప్పును మాత్రమే కొనుగోలు చేయాలి. గుర్తింపు పొందిన బ్రాండ్‌లను ఉపయోగించడం ఉత్తమం. మార్కెట్లో తక్కువ ధరకు లభించే నాణ్యత లేని పప్పులను కొనడం మానుకోవాలి.

# పుచ్చకాయలోని తెల్లని భాగం పొరబాటున ఎప్పుడైనా తినేశారా?

చాలా మందికి పుచ్చకాయలోని ఎర్రటి భాగాన్ని తినడం అలవాటు. మిగిలిన ఆకుపచ్చ తొక్కను, దానికి అంటుకున్న తెల్లటి భాగాన్ని పారేస్తుంటాం. అయితే వైద్యులు పూర్తిగా భిన్నమైన విషయం ఒకటి చెబుతున్నారు. అందేంటంటే.. పుచ్చకాయలోని తెల్లని భాగాన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయట. వేసవిలో ప్రకృతి ప్రసాధించిన అద్భుత వరం పుచ్చకాయ. పండ్ల రారాజు మామిడి, లిచీ, పుచ్చకాయ వంటి అన్ని రకాల పండ్లు ఈ కాలంలో అధికంగా వస్తాయి. ముఖ్యంగా వేసవి వేడి నుంచి ఉపశమనం కలిగించడంలో పుచ్చకాయకు మించిన ప్రత్యామ్నయం మరొకటి లేదు. అయితే మనలో చాలా మందికి పుచ్చకాయలోని ఎర్రటి భాగాన్ని తినడం అలవాటు. మిగిలిన ఆకుపచ్చ తొక్కను, దానికి అంటుకున్న తెల్లటి భాగాన్ని పారేస్తుంటాం. అయితే వైద్యులు పూర్తిగా భిన్నమైన విషయం ఒకటి చెబుతున్నారు. అందేంటంటే.. పుచ్చకాయలోని తెల్లని భాగాన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయట. ఇందులో సిట్రుల్లైన్ అనే ఒక రకమైన అనావశ్యక అమైనో ఆమ్లం ఉంటుంది. పుచ్చకాయలోని తెల్లని భాగం తినడం వల్ల శరీరంలో దీని స్థాయి పెరుగుతుంది. సిట్రులిన్ మన రక్త నాళాలను విస్తరిస్తుంది. యుఎస్ నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ పరిశోధన ప్రకారం సిట్రుల్లైన్ కండరాలకు ఆక్సిజన్ అందిస్తుంది. ఫలితంగా పనితీరు పెరుగుతుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ హైపర్‌టెన్షన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. పుచ్చకాయలోని తెలుపు, ఇతర భాగాలు పెద్దలలో అధిక రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. పుచ్చకాయ తొక్కలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు అనేక ప్రయోజనాలను కలిగి ఉంటాయనే సంగతి తెలిసిన విషయమే. ఫైబర్ ప్రేగు కదలికలకు సహాయపడుతుంది. పెద్దప్రేగు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు త్వరగా కడుపు నింపుతాయి. ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తాయి. బరువును నియంత్రించడంలో సహాయపడతాయి.



# డయాబెటిస్‌తో బాధపడుతున్నారా?

డయాబెటిస్ రోగులు కొన్నిసార్లు శరీరంలో వాపు సమస్యను ఎదుర్కొంటారు. అలాంటి సమయంలో ఉల్లిపాయలు తినడం లాభదాయకం. ఈ రోజుల్లో హై బ్లడ్ షుగర్ లేదా డయాబెటిస్ సమస్య చాలా మంది వ్యక్తులలో సాధారణంగా కనిపిస్తోంది. ఈ వ్యాధికి పూర్తి స్థాయి నివారణ లేనప్పటికీ దీనిని నియంత్రణలో ఉంచడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడానికి ప్రజలు అనేక రకాల ఇంటి చిట్కాలను పాటిస్తారు. మందులను ఉపయోగిస్తారు. అయితే, ఉల్లిపాయలు తినడం కూడా డయాబెటిస్ రోగులకు చాలా మేలు చేస్తుందని తెలుసుకోవడం ఆసక్తికరం. ఉల్లిపాయల్లో ఫోలేట్, విటమిన్ సి, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. ఉల్లిపాయలను వంటలో వేసుకుని తినవచ్చు. కానీ పచ్చి ఉల్లిపాయలు తినడం ఇంకా ఎక్కువ ప్రయోజనకరం. ఉల్లిపాయల్లో ఉండే క్వెర్సెటిన్ అనే యాంటీఆక్సిడెంట్ గుణం రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. దీనిని తినడం వల్ల శరీరం గ్లూకోజ్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రణలో ఉంచవచ్చు. ఉల్లిపాయల గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉన్న ఆహార పదార్థాలు డయాబెటిస్ రోగులకు ఎంతో మంచివి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని వేగంగా పెంచవు. అందుకే పచ్చి ఉల్లిపాయలను నిరభ్యంతరంగా తినవచ్చు. డయాబెటిస్ రోగులు కొన్నిసార్లు శరీరంలో వాపు సమస్యను ఎదుర్కొంటారు. అలాంటి సమయంలో ఉల్లిపాయలు తినడం లాభదాయకం. ఉల్లిపాయల్లోని సల్ఫర్ సమ్మేళనాలు, యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో, బరువు తగ్గడంలో కూడా ఉల్లిపాయలు ఉపయోగపడతాయి. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. డయాబెటిస్ రోగులకు బరువును నియంత్రణలో ఉంచడం చాలా ముఖ్యం. ఉల్లిపాయలను కూరల్లో కలిపి తినవచ్చు లేదా సలాడ్‌గా కూడా సేవించవచ్చు. డయాబెటిస్ రోగులకు ఉల్లిపాయలు ఒక సహజమైన, సులభమైన ఆహార ఎంపిక. దీనిని రోజువారీ ఆహారంలో చేర్చడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంతో పాటు ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు. అయితే ఏదైనా కొత్త ఆహారాన్ని డైట్‌లో చేర్చే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. ముఖ్యంగా డయాబెటిస్‌తో ఇబ్బంది పడేవారు వైద్యులను సంప్రదించాలి.



## ఈ పండ్లు తింటే జీవితంలో గుండె జబ్బులు రావ్..



నేటి కాలంలో ఆరోగ్యంగా ఉండటం పెను సవాలే. మారిన జీవన శైలి, అనారోగ్యకరమైన ఆహారం ఆరోగ్య సమస్యలను పెంచుతున్నాయి. ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరినీ హడలెత్తిస్తున్న ప్రధాన సమస్య గుండె సమస్యలు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ దీని బారీన పడుతున్నారు. నేటి కాలంలో గుండె జబ్బులు పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరినీ ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పటికే ఎంతో మంది యువకులు, చిన్న పిల్లలు గుండెపోటుతో మృతి చెందారు. దీనికంతటికీ కారణం మనం తినే ఆహారాలు, మన తప్పుడు దిన చర్యలే కారణం అంటున్నారు నిపుణులు. అందువల్ల, గుండె జబ్బులను ఎలా నివారించాలో నిపుణులు కొన్ని సలహాలు ఇస్తున్నారు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన ఆహారం చాలా అవసరం. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి దోహదం చేసే 5 రకాల పండ్లు ఇవే. బ్లూబెర్రీస్‌లో ఆంథోసైనిన్లు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు. ఇవి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. రక్తపోటును తగ్గిస్తుంది. యాపిల్స్ ఫైబర్ కు మంచి మూలం. గుండెకు మేలు చేసే ఆమ్లాలు ఇందులో అధికంగా ఉంటాయి. పెక్టిన్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను సక్రమంగా ఉంచుతుంది. ప్రతిరోజూ ఒక ఆపిల్ తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దానిమ్మ గుండె ఆరోగ్యానికి మేలు చేసే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లను అందిస్తుంది. దీన్ని తినడం రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. గుండె సామర్థ్యం పెరుగుతుంది. రక్తపోటు, పిత్త సమతుల్యతను కాపాడుకోవడం సాధ్యమవుతుంది.అవకాడోలు గుండెకు ఆరోగ్యకరమైన మోనోశాచురేటెడ్ కొవ్వులతో నిండి ఉంటాయి. ఇందులో పొటాషియం, విటమిన్ కె అధికంగా ఉంటాయి. ఇందులో ఫోలేట్ అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అవకాడో జీర్ణక్రియ, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నారింజలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. రక్తపోటును నియంత్రిస్తుంది.

## ఈ సమస్యలు ఉన్నవారు ఖర్జూర పండ్లు తినకూడదు..!



ఆరోగ్య నిపుణుల ప్రకారం కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లయితే అలాంటి పరిస్థితిలో ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోకుండా ఖర్జూరాన్ని మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. ఖర్జూరం తినడం వల్ల ఆరోగ్యానికి సంబంధించిన అనేక తీవ్రమైన సమస్యలు తొలగిపోతాయి. అందుకే ఆరోగ్య నిపుణులు ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో ఖర్జూరాన్ని చేర్చుకోవాలని సలహా ఇస్తారు. నిపుణుల ప్రకారం.. సరైన మోతాదులో సరైన విధానంలో ఈ డ్రై ఫ్రూట్‌ను ఆహార ప్రణాళికలో చేర్చుకుంటే మొత్తం ఆరోగ్యం చాలా వరకు మెరుగుపడుతుంది. అయితే, ఖర్జూరం తినడం వల్ల కొందరి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం కూడా పడవచ్చు. అందువల్ల కొన్ని సందర్భాల్లో ఈ వారు ఖర్జూరాన్ని ఆహారంలో తీసుకోకుండా ఉండాలి. ఆరోగ్య నిపుణుల ప్రకారం కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లయితే అలాంటి పరిస్థితిలో ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోకుండా ఖర్జూరాన్ని మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. అలాగే, అధిక మోతాదులో ఖర్జూరం తీసుకోవడం వల్ల మీ బరువు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి ఊబకాయం నుండి విముక్తి పొందాలనుకుంటే ఖర్జూరం తినడం మానుకోవడం మంచిది. డయేరియా సమస్యతో బాధపడుతున్న రోగులు కూడా ఈ డ్రై ఫ్రూట్‌ను తినకుండా ఉండాలి. ఖర్జూరంలో ఉండే కొన్ని పదార్థాలు డయేరియా సమస్యను మరింత పెంచే పని చేస్తాయి. అంతేకాకుండా అధిక మోతాదులో ఖర్జూరం తినడం వల్ల మలబద్ధకం సమస్య కూడా పెరగవచ్చు. గర్భం దాల్చిన సమయంలో ఆహారం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. ఇలాంటి పరిస్థితిలో గర్భిణీ స్త్రీలు కూడా ఎక్కువగా ఖర్జూరం తినకూడదు. వైద్యుడి సలహా లేకుండా ఈ డ్రై ఫ్రూట్‌ను తినకపోవడమే మంచిది. అంతేకాకుండా ఖర్జూరం తినడం వల్ల అలర్జీ ఉంటే ఈ డ్రై ఫ్రూట్‌ను మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. ఖర్జూరం  తినడం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే కొన్ని పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. దీన్ని సమతుల్యంగా తీసుకుంటే శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఖర్జూరం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరంగా చూద్దాం!

## రాత్రి భోజనంలో అన్నం తింటున్నారా?



దాదాపు ప్రతి ఇంటిలోనూ అన్నం ప్రధాన ఆహారం. చాలా మంది మధ్యాహ్నం, రాత్రి భోజనానికి అన్నం తినడానికి ఇష్టపడతారు. కానీ రాత్రిపూట అన్నం తినడం ఆరోగ్యానికి మంచిదా? అనే సందేహం పలువురికి ఉంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బియ్యం మన శరీరానికి శక్తిని, అవసరమైన పోషకాలను అందిస్తున్నప్పటికీ రాత్రిపూట ఆలస్యంగా తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. బియ్యంలో సాధారణంగా కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇది శరీరానికి శక్తిని ఇస్తుంది. అయితే రాత్రిపూట మన శారీరక శ్రమ చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి, కార్బోహైడ్రేట్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల అదనపు కేలరీలు పేరుకుపోతాయి. అంతేకాకుండా నిద్రలో శరీర జీవక్రియ నెమ్మదిస్తుంది. దీనివల్ల అదనపు కేలరీలను బర్న్ చేయడం కష్టమవుతుంది. ఇది కాలక్రమేణా బరువు పెరగడానికి దారితీస్తుంది. తెల్ల బియ్యం అధిక గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటాయి. దీని అర్థం ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ముఖ్యంగా మధుమేహం లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి రాత్రి భోజనంలో అన్నం తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరుగుతాయి. కాలక్రమేణా ఇది టైప్ 2 డయాబెటిస్, ఇతర జీవక్రియ రుగ్మతల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి, మంచి ఆహారాన్ని ఎంచుకోవడం రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి మంచి మార్గం. చాలా మందికి రాత్రి భోజనంలో అన్నం తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు ఎదురవుతాయి. అంతేకాకుండా బియ్యంలోని కార్బోహైడ్రేట్లు జీర్ణక్రియను నెమ్మదింపజేస్తాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో జీర్ణక్రియ సరిగా లేని వారికి, రాత్రి భోజనానికి అన్నం తినడం వల్ల ఆమ్లత్వం, అపాన వాయువు ఏర్పడతాయి. ఇది మీ నిద్రను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. బియ్యంలో నిద్రను ప్రోత్సహించే ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉండటం వల్ల ఇది శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. రాత్రిపూట క్రమం తప్పకుండా అన్నం తినడం వల్ల పొట్ట దగ్గర కొవ్వు పెరుగుతుంది. తెల్ల బియ్యంలో శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇందులో ఫైబర్ తక్కువగా ఉంటుంది. దీనిని అధికంగా తీసుకోవడం వల్ల బొడ్డు చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. బియ్యం బదులుగా ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల ఆరోగ్యకరమైన శరీరాన్ని కాపాడుకోవచ్చు. రాత్రిపూట రోటీ లేదా చపాతీ, రాగి, కూరగాయల సూప్ వంటి ఆహారాలు తినడానికి ప్రయత్నించాలి.